తరంగాలు
రిపోర్టర్లు కావలెను
అతి తక్కువ కాలంలో తెలుగు రాష్ట్రాల్లో అత్యంత ప్రజాదరణ పొందుతున్న 'తరంగాలు' జాతీయ దినపత్రిక నందు పనిచేయుటకు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లోని అన్ని జిల్లాలోని అన్ని మండలాల నుండి రిపోర్టర్లు కావలెను.
సంప్రదించండి...
ఎడిటర్: గడ్డం నాగరాజు గౌడ్
94949 23460

https://epaper.tharangalu.in
RNI. TELTEL / 2022 / 83463
జాతీయ దిన పత్రిక
# తరంగాలు
Tharangalu Daily News Paper
ప్రతి అక్షరం.... సామాన్యుడి అస్త్రం...

హైదరాబాద్
శనివారం
11 ఏప్రిల్ 2026
సంపుటి 03
సంచిక 183
పేజీలు 8
వెల రూ.5.00

Published From : Hyderabad,Circulated:Telangana,Andhrapradesh
Epaper: www.tharangalu.in.com

### ఇంటర్ విద్యార్థిని గొంతు కోసిన

# ప్రేమోన్మాది

- కడప జిల్లా ఖాజీపేటలో దారుణ ఘటన
- ఖాజీపేటలో ఇంట్లో ఒంటరిగా ఉన్న సమయంలో ఘాతుకానికి పాల్పడిన యువకుడు
- సోషల్ మీడియా ఫోటోల పేరుతో వేధింపులు.. తన వద్ద ఫోనే లేదంటున్న తల్లిదండ్రులు
- నిందితుడు వెంకటేశ్‌ను అదుపులోకి తీసుకున్న పోలీసులు.. గ్రామంలో విషాదఛాయలు



కడప, ఏప్రిల్ 10 (తరంగాలు ప్రతినిధి): కడప జిల్లాలోని ఖాజీపేట మండల కేంద్రంలో అత్యంత దారుణమైన ఘటన చోటుచేసుకుంది. ఇంటర్మీడియట్ చదువుతున్న ఓ విద్యార్థినిని ఓ యువకుడు గొంతు కోసి కిరాతకంగా హత్య చేశాడు. పరీక్షలు ముగిసి ఇంట్లోనే ఉంటున్న ఆ బాలికను, ఎవరూ లేని సమయం చూసి మట్టుబెట్టడం స్థానికంగా తీవ్ర కలకలం రేపింది. కళ్లముందే తిరుగుతున్న కూతురు రక్తపు మడుగులో విగతజీవిగా పడి ఉండటం చూసి ఆ తల్లిదండ్రులు గుండెలవిసేలా రోదిస్తున్నారు. ఈ ఘటన శుక్రవారం సాయంత్రం వెలుగులోకి రావడంతో ఖాజీపేట గ్రామం ఒక్కసారిగా దిగ్భ్రాంతికి లోనైంది.

వివరాల్లోకి వెళ్తే, ఖాజీపేటకు చెందిన కీర్తన అనే యువతి ఇంటర్మీడియట్ చదువుతోంది. ఇటీవల పరీక్షలు పూర్తి కావడంతో ప్రస్తుతం ఆమె ఇంట్లోనే ఉంటోంది. శుక్రవారం ఉదయం ఆమె తల్లిదండ్రులు తమ వ్యాపార పనుల నిమిత్తం బయటకు వెళ్లారు. ఇంట్లో కీర్తన ఒంటరిగా ఉన్న విషయాన్ని గమనించిన వెంకటేశ్ అనే యువకుడు, లోపలికి ప్రవేశించి ఆమెపై దాడి చేశాడు. అత్యంత కిరాతకంగా ఆమె గొంతు కోసి అక్కడి నుండి

➤ మిగతా 2వ పేజిలో..

## నేడు లేదా రేపు
# ఇంటర్ ఫలితాలు

హైదరాబాద్, ఏప్రిల్ 10 (తరంగాలు ప్రతినిధి): తెలంగాణ ఇంటర్మీడియట్ ఫలితాల విడుదలపై నెలకొన్న ఉత్కంఠకు తెరపడనుంది. తాజాగా అందుతున్న సమాచారం ప్రకారం, రాష్ట్ర విద్యాశాఖ ఏప్రిల్ 12న ఆదివారం ఫలితాలను వెల్లడించేందుకు రంగం సిద్ధం చేసినప్పటికీ, పలు జాతీయ స్థాయి నివేదికల ప్రకారం ఒక రోజు ముందే అంటే ఏప్రిల్ 11న శనివారం కూడా ఫలితాలు వచ్చే అవకాశం ఉందనే చర్చ జరుగుతోంది. ఈ ఏడాది ఫిబ్రవరి 26 నుంచి మార్చి 18 వరకు జరిగిన వార్షిక పరీక్షలకు రాష్ట్రవ్యాప్తంగా సుమారు 9.9 లక్షల మంది విద్యార్థులు హాజరయ్యారు. ప్రథమ , ద్వితీయ సంవత్సరాల ఫలితాలను ఒకేసారి విడుదల చేసేందుకు బోర్డు అన్ని కసరత్తులు పూర్తి చేసింది. విద్యార్థులు తమ ఫలితాలను విడుదలైన వెంటనే అధికారిక వెబ్‌సైట్లలో హాల్ టికెట్ నంబర్‌ను నమోదు చేసి మార్కుల మెమోను డౌన్‌లోడ్ చేసుకోవచ్చు.



# తదుపరి డిజిపిగా సివి ఆనంద్ ?

**ప్రభుత్వ పరిశీలనలో ఆయన పేరు**

హైదరాబాద్, ఏప్రిల్ 10 (తరంగాలు ప్రతినిధి): తెలంగాణ రాష్ట్రానికి కొత్త పోలీస్ బాస్ నియామక ప్రక్రియ తుది దశకు చేరుకుంది. 1991వ బ్యాచ్‌కు చెందిన సీనియర్ ఐపీఎస్ అధికారి సి.వి. ఆనంద్ తెలంగాణ రాష్ట్ర తదుపరి పూర్తిస్థాయి డీజీపీగా బాధ్యతలు చేపట్టే అవకాశాలు పుష్కలంగా ఉన్నాయని సమాచారం. ప్రస్తుతం రాష్ట్రంలో ఇన్-చార్జ్ డీజీపీగా కొనసాగుతున్న బి. శివధర్ రెడ్డి ఈ నెల 31న పదవీ విరమణ చేయనుండటంతో, ఆ స్థానంలో శాశ్వత ప్రాతిపదికన కొత్త అధికారిని నియమించేందుకు ప్రభుత్వం సిద్ధమైంది. ఈ నియామకం కోసం రాష్ట్రం పంపిన ఐదుగురు అధికారుల జాబితాను పరిశీలించిన యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ , ముగ్గురు అధికారులతో కూడిన ప్యానెల్‌ను రాష్ట్ర ప్రభుత్వానికి సిఫార్సు చేసింది. ఆ జాబితాలో సి.వి. ఆనంద్‌తో పాటు కేంద్ర ఇంటలిజెన్స్ బ్యూరో స్పెషల్ డైరెక్టర్‌గా ఉన్న వినాయక ప్రభాకర్ ఆప్టే , తెలంగాణ జైళ్ల శాఖ డీజీగా ఉన్న సౌమ్య మిశ్రాల పేర్లు ఉన్నాయి. అయితే, ప్రస్తుత

➤ మిగతా 2వ పేజిలో..

### మహిళా భద్రత కోసం
# 'షీ నేత్ర' బృందాలు

- హిడెన్ కెమెరాల చెక్ కోసం హైదరాబాద్ పోలీసుల కొత్త అస్త్రం
- బహిరంగ, ప్రైవేట్ ప్రదేశాల్లో నిఘా కోసం 7 ప్రత్యేక బృందాల ఏర్పాటు
- అత్యాధునిక డిటెక్టర్లతో మాల్స్, హోటళ్లు, హాస్టళ్లలో ఆకస్మిక తనిఖీలు
- నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు.. బ్లాక్ లిస్ట్‌లో పెట్టే అవకాశం



2

## ప్రేమోన్మాది వికృత చేష్టకు
# యువతి బలి

- ఎయిడ్స్ రక్తం ఎక్కించిన ఘటనలో విషాదాంతం
- పెళ్లికి నిరాకరించిందని యువతిపై మనోహర్ పైశాచిక ప్రతీకారం
- హెచ్ఐవీ రక్తాన్ని ఇంజెక్షన్ ద్వారా ఎక్కించి ఘాతుకం
- మనస్తాపంతో ప్రాణాలు విడిచిన బాధితురాలు
- నిందితుడు జైలులో ఉన్నా తప్పని మృత్యువు



హైదరాబాద్, ఏప్రిల్ 10 : ప్రేమ పేరుతో వేధించడమే కాకుండా, ఒక నిండు ప్రాణాన్ని అత్యంత క్రూరంగా బలితీసుకున్న ప్రేమోన్మాది ఉదంతం తెలుగు రాష్ట్రాల్లో

➤ మిగతా 2వ పేజిలో..

### హెచ్‌ఎండీఏ కాంట్రాక్టుల్లో
# భారీ అవినీతి



- కాంగ్రెస్ ప్రభుత్వంపై కవిత ధ్వజమెత్తు
- రూ.1,142 కోట్ల పనులు నామినేషన్ పద్ధతిలో కట్టబెట్టడంపై ఆగ్రహం
- ఆఫీసర్స్ కమిటీ సిఫార్సులను సీఎం రేవంత్ రెడ్డి బుట్టదాఖలు చేశారని విమర్శ
- స్టేట్ ఫైనాన్షియల్ కోడ్‌కు విరుద్ధంగా వ్యవహరిస్తున్నారని ఆరోపణ

హైదరాబాద్, ఏప్రిల్ 10 (తరంగాలు ప్రతినిధి): హైదరాబాద్ మెట్రోపాలిటన్ డెవలప్‌మెంట్ అథారిటీ పరిధిలో జరుగుతున్న పనుల కేటాయింపులపై ఎమ్మెల్సీ, తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. కాంగ్రెస్ ప్రభుత్వం పారదర్శకతను విస్మరించి, భారీ ఎత్తున నామినేషన్ పద్ధతిలో కాంట్రాక్టులను కట్టబెడుతూ అవినీతికి పాల్పడుతోందని ఆమె ఆరోపించారు. నిబంధనలకు విరుద్ధంగా జరుగుతున్న ఈ పనుల కేటాయింపులపై ప్రభుత్వం తక్షణమే సమాధానం చెప్పాలని ఆమె డిమాండ్ చేశారు. ప్రజా

➤ మిగతా 2వ పేజిలో..

### అన్నా..మీతో కలిసి పని చేయమని
# "నన్ను దేవుడే పంపిండు"



- కేసీఆర్‌తో మాజీ మంత్రి జీవన్ రెడ్డి భావోద్వేగ వ్యాఖ్యలు
- ఎర్రవెల్లిలో భావోద్వేగ దృశ్యాలు



- ఎర్రవెల్లి నివాసంలో ఘన స్వాగతం పలికిన కేటీఆర్, మాజీ మంత్రులు
- జగిత్యాల రాజకీయాల్లో సరికొత్త సమీకరణాలకు వేదికైన మర్యాదపూర్వక భేటీ

హైదరాబాద్, ఏప్రిల్ 10 (తరంగాలు ప్రతినిధి): తెలంగాణ రాజకీయాల్లో మరో కీలక పరిణామం చోటుచేసుకుంది. మాజీ మంత్రి మరియు సీనియర్ నాయకుడు టి. జీవన్ రెడ్డి శుక్రవారం నాడు బీఆర్ఎస్ అధినేత కల్వకుంట్ల చంద్రశేఖర్ రావుతో ఎర్రవెల్లిలోని ఆయన నివాసంలో మర్యాదపూర్వక భేటీ అయ్యారు. ఈ సందర్భంగా నివాసానికి

➤ మిగతా 2వ పేజిలో..

## ఇంటర్ విద్యార్థిని గొంతు కోసిన ప్రేమోన్మాది

➤ మొదటి పేజీ తరువాయి



పరారయ్యాడు. సాయంత్రం పనులు ముగించుకుని ఇంటికి తిరిగి వచ్చిన తల్లిదండ్రులకు, తమ కుమార్తె నిర్జీవంగా పడి ఉండటం చూసి ఏం జరిగిందో అర్థం కాక నిర్ఘాంతపోయారు. ఈ హత్య వెనుక ఉన్న కారణాలను బాధితురాలి తల్లిదండ్రులు పోలీసులకు వివరించారు. సుమారు ఆరు నెలల క్రితం నిందితుడు వెంకటేశ్ తమ ఇంటికి వచ్చి, కీర్తన సోషల్ మీడియాలో ఫోటోలు పెడుతోందని, ఆమెను అదుపులో పెట్టుకోవాలని హెచ్చరించాడని తెలిపారు. అయితే, తమ కుమార్తె వద్ద అసలు మొబైల్ ఫోనే లేదని, లేని విషయాన్ని సాకుగా చూపి అప్పటి నుండి ఆమెపై కక్ష పెంచుకున్నాడని వారు ఆరోపించారు. పాత కక్షతోనే పక్కా ప్రణాళిక ప్రకారం తమ బిడ్డను పొట్టనబెట్టుకున్నాడని వారు కన్నీరుమున్నీరుగా విలపిస్తూ పోలీసులకు ఫిర్యాదు చేశారు.సమాచారం అందుకున్న వెంటనే పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని ప్రాథమిక ఆధారాలను సేకరించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. నిందితుడు వెంకటేశ్‌ను పోలీసులు ఇప్పటికే అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. సోషల్ మీడియా వివాదమే ఈ హత్యకు దారితీసిందా? లేక మరేదైనా కారణం ఉందా? అనే కోణంలో పోలీసులు లోతుగా దర్యాప్తు చేస్తున్నారు. నిందితుడిపై కఠినమైన సెక్షన్ల కింద కేసు నమోదు చేసినట్లు పోలీసులు వెల్లడించారు. చిన్న వయసులోనే ఒక విద్యార్థిని ఇలా అన్యాయంగా ప్రాణాలు కోల్పోవడం పట్ల గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. నిందితుడిని కఠినంగా శిక్షించి, బాధితురాలి కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేస్తున్నారు. సోషల్ మీడియా పేరుతో యువతులను వేధించే వారిపై పోలీసులు ఉక్కుపాదం మోపాలని స్థానికులు కోరుతున్నారు. ఈ దారుణ హత్యతో ఖాజీపేటలో విషాదకర వాతావరణం నెలకొంది. చదువుకుని ఉన్నత స్థాయికి చేరుతుందనుకున్న కూతురు శాశ్వతంగా దూరమవ్వడంతో ఆ కుటుంబం కోలుకోలేకపోతోంది.

## హెచ్ఎండీఏ కాంట్రాక్టుల్లో భారీ అవినీతి

ధనాన్ని దుర్వినియోగం చేస్తూ తమకు కావాల్సిన వారికి పనులు అప్పగించడం ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధమని ఆమె ఈ సందర్భంగా పేర్కొన్నారు. హెచ్ఎండీఏ పరిధిలో పనుల కేటాయింపునకు సంబంధించి గతంలోనే ఒక ఉన్నత స్థాయి ఆఫీసర్స్ కమిటీ కొన్ని కీలక సిఫార్సులు చేసిందని కవిత గుర్తు చేశారు. పనులను నామినేషన్ పద్ధతిలో కాకుండా కేవలం బహిరంగ టెండర్ల ద్వారానే కట్టబెట్టాలని ఆ కమిటీ స్పష్టంగా నివేదిక ఇచ్చిందని ఆమె తెలిపారు. అయినప్పటికీ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆ రిపోర్టును ఏమాత్రం పట్టించుకోకుండా పక్కన పెట్టేశారని ఆమె విమర్శించారు. నిపుణుల కమిటీ సూచనలను బేఖాతరు చేస్తూ ప్రభుత్వం మొండిగా ముందుకు వెళ్లడం వెనుక పెద్ద ఎత్తున క్విడ్ ప్రో కో కుట్ర దాగి ఉందని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు అనుమానం వ్యక్తం చేశారు.సుమారు 1,142 కోట్ల రూపాయల విలువైన పనులను నామినేషన్ పద్ధతిలో ఇవ్వడాన్ని తాము తీవ్రంగా ఖండిస్తున్నామని కవిత స్పష్టం చేశారు. ఇది స్టేట్ ఫైనాన్షియల్ కోడ్‌కు పూర్తి వ్యతిరేకమని, ప్రభుత్వ నిబంధనలను కాంగ్రెస్ నేతలు కాలరాస్తున్నారని మండిపడ్డారు. టెండర్ల ప్రక్రియ ద్వారా పనులు కేటాయిస్తే ప్రభుత్వానికి ఆదాయం రావడమే కాకుండా, పనుల్లో నాణ్యత కూడా ఉంటుందని ఆమె వివరించారు. కానీ ప్రస్తుత ప్రభుత్వం కేవలం కమిషన్ల కోసమే నామినేషన్ పద్ధతిని ఎంచుకుందని ఆమె ఆరోపించారు. ఈ వ్యవహారంపై సమగ్ర విచారణ జరపాలని ఆమె ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రభుత్వం ఇప్పటికైనా మేల్కొని నామినేషన్ పద్ధతిలో ఇచ్చిన కాంట్రాక్టులను రద్దు చేయాలని కవిత డిమాండ్ చేశారు. ప్రతి పనిని పారదర్శకంగా టెండర్ల ద్వారానే అర్హులైన వారికి అప్పగించాలని ఆమె సూచించారు. లేనిపక్షంలో ప్రజాక్షేత్రంలో కాంగ్రెస్ ప్రభుత్వ అవినీతిని ఎండగడతామని ఆమె హెచ్చరించారు. రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను దెబ్బతీసేలా ప్రభుత్వం తీసుకుంటున్న ఇటువంటి నిర్ణయాలపై తాము పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు. హెచ్ఎండీఏ నిధులను అధికార పార్టీ నేతల జేబుల్లోకి మళ్లించే ప్రయత్నాలను అడ్డుకుంటామని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు పునరుద్ఘాటించారు.మొత్తానికి హెచ్ఎండీఏ కాంట్రాక్టుల వ్యవహారం ఇప్పుడు తెలంగాణ రాజకీయాల్లో వేడి పుట్టిస్తోంది. కవిత చేసిన ఆరోపణలపై అధికార పక్షం ఎలా స్పందిస్తుందోనన్న ఉత్కంఠ నెలకొంది. పారదర్శక పాలన అందిస్తామని చెప్పి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్, కేవలం కొద్ది నెలల్లోనే వేల కోట్ల రూపాయల పనులను టెండర్లు లేకుండా ఇవ్వడం చర్చనీయాంశంగా మారింది. ఈ అంశంపై విపక్షాలు ఏకతాటిపైకి వచ్చి ప్రభుత్వాన్ని నిలదీసేందుకు సిద్ధమవుతున్నాయి. రానున్న రోజుల్లో ఈ కాంట్రాక్టుల వ్యవహారం మరిన్ని మలుపులు తిరిగే అవకాశం ఉందని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు.

## తదుపరి డిజిపిగా సివి ఆనంద్ ?

డీజీపీ శివధర్ రెడ్డి పేరు ఈ సిఫార్సు జాబితాలో లేకపోవడంతో ఆయన పదవీ విరమణ అనివార్యం కాగా, సీనియారిటీ , రాష్ట్రంలో సుదీర్ఘ కాలం వివిధ హోదాల్లో పనిచేసిన అనుభవం దృష్ట్యా సి.వి. ఆనంద్ పేరుకే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మొగ్గు చూపుతున్నట్లు తెలుస్తోంది. గతంలో రెండుసార్లు

డీజీపీ పదవికి ఆయన పేరు పరిశీలనలోకి వచ్చినప్పటికీ సాంకేతిక కారణాల వల్ల అవకాశం దక్కలేదు, కానీ ఈసారి సుప్రీంకోర్టు మార్గదర్శకాల ప్రకారం శాశ్వత ప్రాతిపదికన ఆయన నియమితులయ్యే అవకాశం ఉంది. ఈ నియామకానికి సంబంధించిన అధికారిక ఉత్తర్వులు ఈ నెల 14వ తేదీ తర్వాత వెలువడే సూచనలు కనిపిస్తున్నాయి. ఒకవేళ సి.వి. ఆనంద్ బాధ్యతలు చేపడితే, ఆయన పదవీ కాలం 2028 మే వరకు ఉంటుంది. మరోవైపు, మహిళా అధికారులకు కూడా ప్రాధాన్యత ఇస్తూ హోం శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా ఒక మహిళా డీజీ స్థాయి అధికారిని నియమించాలని ప్రభుత్వం యోచిస్తోంది. హైకోర్టు ఆదేశాల ప్రకారం ఏప్రిల్ 13 నాటికి డీజీపీ నియామకంపై తుది నిర్ణయం తీసుకోవాల్సి ఉండటంతో, త్వరలోనే రాష్ట్ర పోలీస్ శాఖలో ఈ కీలక మార్పు చోటుచేసుకోనుంది.

# మహిళా భద్రత కోసం 'షీ నేత్ర' బృందాలు

- హిడెన్ కెమెరాల చెక్ కోసం హైదరాబాద్ పోలీసుల కొత్త అస్త్రం
- బహిరంగ, ప్రైవేట్ ప్రదేశాల్లో నిఘా కోసం 7 ప్రత్యేక బృందాల ఏర్పాటు
- అత్యాధునిక డిటెక్టర్లతో మాల్స్, హోటళ్లు, హాస్టళ్లలో ఆకస్మిక తనిఖీలు
- నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు.. బ్లాక్ లిస్ట్‌లో పెట్టే అవకాశం



హైదరాబాద్, ఏప్రిల్ 10(తరంగాలు ప్రతినిధి): మహిళల భద్రత మరియు వ్యక్తిగత గోప్యతను కాపాడటంలో హైదరాబాద్ సిటీ పోలీస్ మరో వినూత్న ముందడుగు వేసింది. పబ్లిక్ ప్రైవేట్ ప్రదేశాలలో హిడెన్ కెమెరాల బెడదను అరికట్టేందుకు 'షీ నేత్ర టీమ్స్' పేరుతో ప్రత్యేక బృందాలను రంగంలోకి దించింది. మహిళల గౌరవానికి భంగం కలిగించేలా కెమెరాల దుర్వినియోగాన్ని అడ్డుకోవడమే ఈ టీమ్స్ ప్రధాన లక్ష్యం. బషీర్‌బాగ్‌లోని పాత కమిషనరేట్ కార్యాలయంలో జరిగిన అధికారిక కార్యక్రమంలో పోలీస్ కమిషనర్ మరియు సీనియర్ ఐపీఎస్ అధికారులు ఈ బృందాలకు అత్యాధునిక కెమెరా డిటెక్టింగ్ పరికరాలను అందజేశారు.

నగరంలోని ఏడు జోన్ల కోసం ఒక్కో జోన్‌కు ఒకటి చొప్పున మొత్తం 7 ప్రత్యేక బృందాలను కేటాయించారు. ఈ బృందాలు అత్యాధునిక కెమెరా డిటెక్టర్లను కలిగి ఉండటమే కాకుండా, కఠినమైన ఎస్‌ఓపీల ప్రకారం పని చేసేలా శిక్షణ పొందాయి. షీ నేత్ర టీమ్స్ ఇకపై నగరంలోని షాపింగ్ మాల్స్, హోటళ్లు, విద్యార్థినుల హాస్టళ్లు, ఆసుపత్రులు, విద్యా సంస్థలు మరియు కమర్షియల్ కాంప్లెక్స్‌లలో ఆకస్మిక తనిఖీలు నిర్వహిస్తాయి. ముఖ్యంగా ట్రయల్ రూమ్స్, వాష్ రూమ్స్ వంటి ప్రదేశాలలో మహిళల గోప్యతకు భంగం కలగకుండా ఈ బృందాలు నిరంతరం నిఘా ఉంచుతాయి. తమ ప్రాంగణాల్లో మహిళల భద్రతకు పూర్తి బాధ్యత యాజమాన్యాలదేనని పోలీసులు స్పష్టం చేశారు. ప్రతి సంస్థలో తప్పనిసరిగా ఒక 'కస్టమర్ సేఫ్టీ ఇన్-ఛార్జ్' ను నియమించాలని ఆదేశాలు జారీ చేశారు. ఎక్కడైనా హిడెన్ కెమెరాలు ఉన్నట్లు గుర్తిస్తే, సదరు యాజమాన్యంపై క్రిమినల్ కేసులు నమోదు చేయడమే కాకుండా, ఆ సంస్థలను బ్లాక్ లిస్ట్‌లో పెట్టే అవకాశం ఉందని హెచ్చరించారు. ప్రైవేట్ ప్రదేశాలలో ఇటువంటి అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వారిపై ఉక్కుపాదం మోపుతామని కమిషనర్ ఈ సందర్భంగా వెల్లడించారు. "మహిళల భద్రత అనేది సామాజిక బాధ్యత" అని పేర్కొన్న పోలీస్ కమిషనర్, ప్రజలు కూడా ఈ విషయంలో అప్రమత్తంగా ఉండాలని కోరారు. ఎక్కడైనా అనుమానాస్పద కార్యకలాపాలు కనిపిస్తే వెంటనే డయల్ 100 లేదా 112 కు సమాచారం అందించాలని సూచించారు. అలాగే షీ టీమ్స్ వాట్సాప్ నంబర్ 9490616555 కు కూడా ఫిర్యాదు చేయవచ్చని తెలిపారు. టెక్నాలజీ సాయంతో మహిళల భద్రతను మరింత పటిష్టం చేసేందుకు ఈ షీ నేత్ర బృందాలు నిరంతరం శ్రమిస్తాయని పోలీసులు ధీమా వ్యక్తం చేశారు.

హైదరాబాద్ పోలీసులు తీసుకున్న ఈ నిర్ణయం పట్ల మహిళా సంఘాలు మరియు సామాన్య ప్రజల నుండి ప్రశంసలు అందుతున్నాయి. ముఖ్యంగా హాస్టళ్లలో ఉంటున్న విద్యార్థినులు మరియు ఉద్యోగినులు ఈ చర్య వల్ల తమకు మరింత రక్షణ లభిస్తుందని ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. అత్యాధునిక సాంకేతికతను ఉపయోగిస్తూ మహిళల గోప్యతను కాపాడటంలో హైదరాబాద్ పోలీస్ దేశానికే ఆదర్శంగా నిలుస్తోంది. ఇకపై ప్రైవేట్ ప్రాంగణాల్లో నిఘా కెమెరాల పేరిట అకృత్యాలకు పాల్పడే వారికి షీ నేత్ర బృందాలు గట్టి హెచ్చరికగా మారనున్నాయి.

# అన్నా..మీతో కలిసి పని చేయమని "నన్ను దేవుడే పంపిండు"



➤ మొదటి పేజీ తరువాయి

చేరుకున్న జీవన్ రెడ్డికి బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పుష్పగుచ్ఛం అందించి సాదరంగా ఆహ్వానించారు. ఈ భేటీ రాజకీయ వర్గాల్లో ఆసక్తిని రేకెత్తించడమే కాకుండా, ఉమ్మడి కరీంనగర్ జిల్లా రాజకీయాల్లో ముఖ్యంగా జగిత్యాల నియోజకవర్గంలో సరికొత్త సమీకరణాలకు దారితీసే అవకాశం ఉందని విశ్లేషకులు భావిస్తున్నారు.

కేసీఆర్‌ను కలిసిన సమయంలో జీవన్ రెడ్డి అత్యంత భావోద్వేగానికి లోనయ్యారు. "అన్నా.. నన్ను దేవుడే పంపిండు మీతో కలిసి పని చేయమని" అంటూ ఆయన చేసిన వ్యాఖ్యలు అక్కడ ఉన్న ఎా ం ం ద రి నీ ఆకట్టుకున్నాయి. గత కొంతకాలంగా సాగుతున్న రాజకీయ పరిణామాల నేపథ్యంలో, ఈ కలయిక (ఎా ద,ా న య త ప్రాధాన్యత సంతరించుకుంది. కేసీఆర్ కూడా జీవన్ రెడ్డిని ఆత్మీయంగా పలకరించి, తాజా రాజకీయ పరిస్థితులపై చర్చించినట్లు తెలుస్తోంది. పార్టీ బలోపేతం మరియు భవిష్యత్తు కార్యాచరణపై వీరి మధ్య సుదీర్ఘంగా చర్చలు జరిగినట్లు సమాచారం.

ఈ భేటీలో బీఆర్ఎస్ పార్టీకి చెందిన పలువురు హేమాహేమీలు పాల్గొన్నారు. మాజీ మంత్రులు కొప్పుల ఈశ్వర్, గంగుల కమలాకర్, ప్రశాంత్ రెడ్డి, ఎమ్మెల్సీ ఎల్ రమణ, కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ కె. సంజయ్ తదితరులు జీవన్ రెడ్డికి స్వాగతం పలికారు. అలాగే మాజీ ఎంపీ జోగినపల్లి సంతోష్ కుమార్, మాజీ ఎమ్మెల్యే కె. విద్యాసాగర్ రావుతో పాటు జగిత్యాల మాజీ జడ్పీ చైర్ పర్సన్ దంపతులు వసంత సురేశ్ ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. సీనియర్ నాయకులు గ్యాదరి బాలమల్లు, మారెడ్డి శ్రీనివాస్ రెడ్డి, రాగిడి లక్ష్మారెడ్డి కూడా కేసీఆర్ నివాసంలో సందడి చేశారు.

జగిత్యాల ప్రాంతంలో బలమైన పట్టున్న జీవన్ రెడ్డి వంటి నాయకుడు కేసీఆర్‌తో భేటీ కావడం వెనుక లోతైన రాజకీయ వ్యూహాలు ఉన్నట్లు రాజకీయ వర్గాల్లో చర్చ జరుగుతోంది. ఇప్పటికే కాంగ్రెస్ ప్రభుత్వ తీరుపై అసంతృప్తితో ఉన్న పలువురు నేతలు బీఆర్ఎస్ వైపు చూస్తున్న తరుణంలో, ఈ పరిణామం అధికార పార్టీకి సవాలుగా మారే అవకాశం ఉంది. ఈ భేటీ తర్వాత జగిత్యాల నియోజకవర్గంలో బీఆర్ఎస్ శ్రేణుల్లో నూతనోత్సాహం కనిపిస్తోంది. పార్టీని సంస్థాగతంగా మరింత బలోపేతం చేసేందుకు ఈ కలయిక దోహదపడుతుందని గులాబీ శ్రేణులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నాయి. మొత్తానికి ఎర్రవెల్లి నివాసం నేడు రాజకీయ చర్చలకు కేంద్ర బిందువుగా మారింది. సీనియర్ నేత జీవన్ రెడ్డి అనుభవం, కేసీఆర్ వ్యూహరచన తోడైతే భవిష్యత్తులో రాజకీయ చిత్రం ఎలా ఉండబోతుందనేది ఆసక్తికరంగా మారింది. ముఖ్యంగా ఉత్తర తెలంగాణ రాజకీయాలపై ఈ భేటీ ప్రభావం చూపే అవకాశం ఉంది. రానున్న రోజుల్లో మరికొందరు కీలక నేతలు కూడా బీఆర్ఎస్ అధినేతను కలిసే అవకాశం ఉన్నట్లు సమాచారం. ప్రజల పక్షాన నిలబడి పోరాటం చేయడమే తమ లక్ష్యమని భేటీ అనంతరం నేతలు స్పష్టం చేశారు.

# ప్రేమోన్మాది వికృత చేష్టకు యువతి బలి

సంచలనం సృష్టిస్తోంది. మేడ్చల్ జిల్లా పోచారం ఐటీ కారిడార్ పోలీస్ స్టేషన్ పరిధిలో గత నెలలో చోటుచేసుకున్న ఈ దారుణ ఘటన నేడు బాధితురాలు ఆత్మహత్య చేసుకోవడంతో విషాదాంతమైంది. నిందితుడు మనోహర్ తనను పెళ్లి చేసుకోవాలని బాధితురాలిని చాలా కాలంగా వేధిస్తూ వచ్చాడు. అయితే ఆమె అందుకు నిరాకరించడంతో, ఆమె జీవితాన్ని నాశనం చేయాలనే వికృత ఆలోచనతో హెచ్ఐవీ సోకిన రక్తాన్ని సేకరించి, అత్యంత వ్యూహాత్మకంగా ఆమె శరీరంలోకి ఎక్కించాడు. ఈ పాపానికి ఒడిగట్టిన మనోహర్ ప్రస్తుతం జైలులో ఉన్నప్పటికీ, అతను చేసిన గాయం ఆ యువతిని మరణం అంచు వరకు తీసుకెళ్లింది.

పోలీసుల విచారణలో ఈ ఘటనకు సంబంధించిన మరిన్ని భయంకరమైన నిజాలు వెలుగులోకి వచ్చాయి. నిందితుడు మనోహర్ ఒక ల్యాబ్ టెక్నీషియన్ పరిచయంతో హెచ్ఐవీ బాధితుల రక్తాన్ని రహస్యంగా సేకరించినట్లు సమాచారం. గత నెల 11వ తేదీన బాధితురాలిని ఒంటరిగా కలిసిన సమయంలో, బహుమతి ఇస్తానని నమ్మించి కళ్లకు గంతలు కట్టి మరీ ఈ ఇంజెక్షన్ ఎక్కించినట్లు తెలుస్తోంది. ఆ తర్వాత తనకు ఆరోగ్యం క్షీణిస్తుండటంతో అనుమానం వచ్చిన యువతి పరీక్షలు చేయించుకోగా, తనకు హెచ్ఐవీ పాజిటివ్ అని తేలింది. ఈ విషయాన్ని తట్టుకోలేకపోయిన బాధితురాలు పోలీసులను ఆశ్రయించగా, నిందితుడిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. అప్పటి నుంచి ఆమె తీవ్రమైన కుంగుబాటుకు లోనైంది. జీవితంపై విరక్తి చెందిన బాధితురాలు ఇవాళ తన నివాసంలో ఎవరు లేని సమయంలో ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. తన తప్పు లేకపోయినా సమాజంలో తలెత్తుకోలేనని, ప్రాణాంతక వ్యాధితో బతకడం కంటే మరణమే మేలని ఆమె భావించినట్లు బంధువులు కన్నీటిపర్యంతమవుతున్నారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని స్వాధీనం చేసుకున్నారు. అనంతరం పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆసుపత్రికి తరలించారు. నిందితుడిపై గతంలోనే హత్యాప్రయత్నం కేసులు నమోదు కాగా, ఇప్పుడు బాధితురాలు మరణించడంతో ఈ కేసును ఆత్మహత్యకు ప్రేరేపించిన కోణంలో మరియు హత్యకు సమానమైన నేరంగా పరిగణించి దర్యాప్తును వేగవంతం చేశారు.రాష్ట్రవ్యాప్తంగా ఈ ఘటనపై తీవ్ర నిరసనలు వ్యక్తమవుతున్నాయి. ఒక ఆడపిల్ల జీవితంతో ఇంత దారుణంగా ఆడుకున్న మనోహర్‌కు ఉరిశిక్ష పడాలని బాధితురాలి కుటుంబ సభ్యులు మరియు స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. ప్రేమోన్మాదుల ఆగడాలకు అడ్డుకట్ట వేయడంలో చట్టాలు కఠినంగా ఉండాలని మహిళా సంఘాలు పేర్కొంటున్నాయి. నిందితుడికి రక్తం సరఫరా చేసిన వారు మరియు అతనికి సహకరించిన వారిని కూడా కఠినంగా శిక్షించాలని కోరుతున్నారు. ఈ పైశాచికత్వం వల్ల ఒక విద్యావంతురాలైన యువతి భవిష్యత్తు అంధకారమవడమే కాకుండా, చివరికి ఆమె తనువు చాలించడం అందరినీ కలిచివేస్తోంది. ప్రభుత్వం ఈ కేసును ప్రతిష్టాత్మకంగా తీసుకుని బాధితురాలి కుటుంబానికి న్యాయం చేయాలని సర్వత్రా విజ్ఞప్తి చేస్తున్నారు. ప్రస్తుతం నిందితుడు మనోహర్ చర్లపల్లి జైలులో రిమాండ్ ఖైదీగా ఉన్నాడు. బాధితురాలు మరణించిన వార్త తెలియడంతో జైలు అధికారులు కూడా అప్రమత్తమయ్యారు. ఈ కేసులో సాక్ష్యాధారాలను సేకరించిన పోలీసులు, నిందితుడికి కఠిన శిక్ష పడేలా చార్జిషీట్ దాఖలు చేసేందుకు సిద్ధమవుతున్నారు. టెక్నాలజీ మరియు ఆధునికత పెరుగుతున్నా, ఇలాంటి వికృత చేష్టలు సమాజాన్ని తలదించుకునేలా చేస్తున్నాయని మేధావులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. బాధితురాలు ఆత్మహత్య చేసుకునే ముందు ఏవైనా లేఖలు రాసిందా అనే కోణంలో కూడా పోలీసులు గాలిస్తున్నారు. ఈ ఘటన మేడ్చల్ జిల్లాలోనే కాకుండా మొత్తం తెలంగాణ సమాజాన్ని దిగ్భ్రాంతికి గురిచేసింది.

THARANGALU DAILY NEWS
శనివారం, 11 ఏప్రిల్, 2026
జాతీయ దిన పత్రిక
తరంగాలు

## భార్యపై భర్త కత్తితో దాడి




**జఫ్ఫర్గడ్ ప్రతినిధి, ఏప్రిల్ 10,(తరంగాలు):** మండలంలోని గర్మిల్లపల్లి గ్రామ శివారులో వరంగల్ డాక్టర్స్ కాలనీకి చెందిన ఏటూరి స్వప్న రాజు దంపతుల మధ్య వివాదం గురువారం రాత్రి చోటుచేసుకుంది. జఫ్ఫర్గడ్ హాస్టల్లో ఉన్న కుమార్తెను కలిసేందుకు ద్విచక్ర వాహనంపై వస్తున్న సమయంలో ఇద్దరి మధ్య వాగ్వాదం ముదిరి భర్త రాజు భార్య స్వప్న పై అనుమానం తో ముందుగానే తాను వెంట తెచ్చుకున్న కూరగాయల కత్తితో దాడి చేయడంతో ఆమె గాయపడింది. గాయపడిన స్వప్నను చికిత్స నిమిత్తం ఎంజీఎం ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటన పై జఫ్ఫర్గడ్ ఎస్సై రామారావు వెంటనే స్పందించి నిందితున్ని శుక్రవారం పట్టుకొని అరెస్టు చేసి రిమాండ్ కు తరలించినట్లు తెలిపారు. ఈ సమావేశంలో కానిస్టేబుల్ ఎంరాజు, రిషికేష్, హెచ్ జి పూర్ణ తదితరులు పాల్గొన్నారు.

## భద్రకాళి చెరువు పూడికతీత పనుల్లో మరింత వేగం పెంచాలి

- **హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయ్**



హనుమకొండ ప్రతినిధి , ఏప్రిల్ 10, తరంగాలు : భద్రకాళి చెరువు పూడికతీత పనులను మరింత వేగవంతం చేసి నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయ్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం భద్రకాళి చెరువులో కొనసాగుతున్న పూడికతీత పనులను కలెక్టర్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. అనంతరం కాజీపేట మండలం అమ్మవారిపేటలోని ప్రభుత్వ స్థలాలలో డంపింగ్ చేస్తున్న పూడిక మట్టిని సంబంధిత అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా చెరువులో జరుగుతున్న పూడికతీత పనుల పురోగతిని తెలుసుకుని, మిగిలిన పనులను వేగవంతంగా పూర్తి చేయాలని సూచించారు. భద్రకాళి చెరువులో తీస్తున్న పూడిక మట్టిని ప్రభుత్వ భూముల్లో క్రమపద్ధతిలో నిల్వ చేయాలని, భూముల పరిరక్షణకు ఇది ఉపయోగపడేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. పూడికతీత పనులను మే 15 నాటికి పూర్తిచేసే విధంగా కార్యాచరణ రూపొందించి అమలు చేయాలని అధికారులను ఆదేశించారు. అలాగే అమ్మవారిపేటతో పాటు ఇతర ప్రాంతాలలో పూడిక మట్టిని నిల్వ చేస్తున్న ప్రభుత్వ భూములు ఆక్రమణకు గురికాకుండా బ్యారికేడింగ్ ఏర్పాటు చేయాలని సూచించారు. మొత్తం 7.70 లక్షల క్యూబిక్ మీటర్ల లక్ష్యానికి గాను ఇప్పటివరకు సుమారు 2 లక్షల క్యూబిక్ మీటర్ల పూడికతీత పూర్తయిందని, మిగిలిన పనులను వేగవంతం చేసి లక్ష్యాన్ని సమయానికి చేరుకోవాలని కలెక్టర్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో తాగునీటి పారుదల శాఖ ఈఈ కిరణ్ కుమార్, డిఈ మధుసూదన్ రెడ్డి, కుడా సీపీఓ అజిత్ రెడ్డి, ఈఈ భీమ్ రావు, ఏఈ శ్యామ్, హనుమకొండ తహసీల్దార్ రవీందర్ రెడ్డి తదితర అధికారులు పాల్గొన్నారు.

## వెంకటాపురం సేవా ట్రస్ట్ స్థాపించి 8 సంవత్సరాలు పూర్తి

- **వెంకటాపురం సేవా ట్రస్ట్ వ్యవస్థాపకులు కొండ యాకన్న గౌడ్**



**తొర్రూర్ ఏప్రిల్ 10 తరంగాలు**

తొర్రూరుమండలంలోని,వెంకటాపురం గ్రామంలో వెంకటాపురం సేవా ట్రస్ట్ వ్యవస్థాపకులు కొండ యాకన్న గౌడ్ ఆధ్వర్యంలో వెంకటాపురం సేవా ట్రస్ట్ కు ప్రతినెల దాతలు అందిస్తున్న సహకారంతో వెంకటాపురం ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు, అంగన్వాడి పిల్లలకు, ప్రీ ప్రైమరీ స్కూల్ పిల్లలకు సన్న బియ్యం,చికెన్ మరి యు అరటి పండ్ల తోటి మధ్యాహ్నం భోజనం ఏర్పాటు చేయడం జరిగింది.ఈ సందర్భం గా కొండ యాకన్న గౌడ్ మాట్లాడుతూ వెంకటాపురం సేవా ట్రస్ట్ స్థాపించి 8 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా విద్యార్థులకు భోజనం ఏర్పాటు చేయడం జరిగిందని అదేవిధంగా గత ఎనిమిది సంవత్సరాలుగా గ్రామంలో ఎన్నో సేవా కార్యక్రమాలు చేయడం జరిగింది.గ్రామంలోని దాతల సహకారంతో వెంకటాపురం సేవా ట్రస్ట్ ద్వార ఇక ముందు కూడ మంచి కార్యక్రమాలు చేస్తానని, సేవా ట్రస్టు ద్వార మంచి కార్యక్రమాలు చేయడానికి ముందు కొచ్చిన ప్రతి ఒక్కరికి పేరు పేరునా ధన్యావాదములు తెలిపారు. ఈ కార్యక్రమములో దాసరోజు హృతిక్ శర్మ, రావుల సంధ్య, పాఠశాల ప్రధానోపాధ్యాయులు హారిక, వెంకటేశ్వర్లు,అంగన్ వాడి టీచర్స్ మనోధర ,కవిత, భవ్య, సత్యమ్మ, జానకి, రామా, ఉప్పమ్మ ,పద్మ, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



# అంగన్వాడీ టీచర్లకు అండగా ప్రభుత్వం

- **వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి**

హనుమకొండ ప్రతినిధి,10 ఏప్రిల్, తరంగాలు : అంగన్వాడీ టీచర్లకు రాష్ట్ర ప్రభుత్వం ఎల్లప్పుడూ అండగా నిలుస్తోందని, వారి సేవలను మరింత సమర్థవంతంగా నిర్వహించేందుకు స్మార్ట్ ఫోన్లను అందజేస్తున్నామని వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి తెలిపారు. శుక్రవారం హనుమకొండ జిల్లా కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాల్‌లో జిల్లా మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో వరంగల్ పశ్చిమ నియోజకవర్గ పరిధిలోని అంగన్వాడీ టీచర్లకు స్మార్ట్ ఫోన్ల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి, గ్రేటర్ వరంగల్ నగర మేయర్ గుండు సుధారాణి, ఎమ్మెల్సీ బస్వరాజ్ సారయ్య, హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి మాట్లాడుతూ, రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తీసుకున్న నిర్ణయాలు అన్ని వర్గాల ప్రజలకు ఆమోదయోగ్యంగా ఉన్నాయని అన్నారు. ప్రజల సమస్యలను తెలుసుకుని వాటి పరిష్కారం దిశగా ప్రభుత్వం సమర్థవంతంగా పనిచేస్తోందని తెలిపారు.



మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ సేవలను స్మార్ట్ ఫోన్ల ద్వారా సమర్థవంతంగా పర్యవేక్షించేందుకు ఈ చర్య దోహదపడుతుందని చెప్పారు. అంగన్వాడీ టీచర్లపై ఉన్న పనిభారాన్ని గుర్తించిన ప్రభుత్వం, త్వరలో వారికి శుభవార్త అందించే దిశగా చర్యలు తీసుకుంటోందని తెలిపారు. అర్హులైన అంగన్వాడీ టీచర్లకు డబుల్ బెడ్‌రూమ్ గృహాలు లేదా స్థలం ఉన్న వారికి ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయిం చేందుకు శాసనమండలి సభ్యులు, సంబంధిత మంత్రులు, మేయర్లతో చర్చించి కృషి చేస్తామని పేర్కొన్నారు. గ్రేటర్ వరంగల్ నగర మేయర్ గుండు సుధారాణి మాట్లాడుతూ, అంగన్వాడీ టీచర్లు ప్రభుత్వం మరియు ప్రజల మధ్య వారధులుగా పనిచేస్తున్నారని అన్నారు. గర్భిణీలు, బాలింతలు మరియు చిన్నారులకు వారు అందిస్తున్న సేవలు అభినందనీయమని పేర్కొన్నారు. హార్డ్ వర్క్ నుంచి స్మార్ట్ వర్క్ వైపు తీసుకెళ్లే ప్రయత్నంలో భాగంగానే స్మార్ట్ ఫోన్లను అందజేసినట్లు తెలిపారు. ఎమ్మెల్సీ బస్వరాజ్ సారయ్య మాట్లాడుతూ, చిన్నారులకు ఆరోగ్యం, విద్య, క్రమశిక్షణ వంటి విలువలను నేర్పించే బాధ్యత అంగన్వాడీ టీచర్లపై ఉందని చెప్పారు. జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి మాట్లాడుతూ, అంగన్వాడీ కేంద్రాలను ప్రైవేట్ ప్లే స్కూల్స్‌కు ధీటుగా అభివృద్ధి




చేయాలని సూచించారు. నాణ్యమైన విద్యా ప్రమాణాలతో బోధన సాగించాలని, ఆరు సంవత్సరాల లోపు చిన్నారులు బోధించిన విషయాలను సులభంగా గ్రహిస్తారని తెలిపారు. బోధనతోపాటు నాణ్యమైన పౌష్టికాహారాన్ని అక్షయపాత్ర ద్వారా అందిస్తున్నామని చెప్పారు. చిన్నారులను చదువుతో పాటు ఆటలలోనూ పాల్గొనేలా ప్రోత్సహించాలని సూచించారు. సమావేశం అనంతరం వరంగల్ పశ్చిమ నియోజకవర్గ పరిధిలోని అంగన్వాడీ టీచర్లకు స్మార్ట్ ఫోన్లను ఎమ్మెల్యే, మేయర్, ఎమ్మెల్సీ, కలెక్టర్ చేతుల మీదుగా పంపిణీ చేశారు. అదేవిధంగా అంగన్వాడీ కేంద్రాల చిన్నారుల కోసం రూపొందించిన యూనిఫారాలను పంపిణీ చేశారు. ఈనెల 9 నుండి 23 వరకు నిర్వహిస్తున్న పోషణ్ పక్వాడా కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్లను ఆవిష్కరించారు. జిల్లా సంక్షేమ అధికారి విశ్వజ అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ ఆర్జేడీ ఝాన్సీ లక్ష్మీబాయి, కార్పొరేటర్లు ఏనుగుల మానస రాంప్రసాద్, జక్కుల రవీందర్ యాదవ్, పోతుల శ్రీమన్, మామిండ్ల రాజు, దేవరకొండ విజయలక్ష్మి, అంగన్వాడీ సూపర్వైజర్లు ఝాన్సీ, కవిత, పోషణ అభియాన్ జిల్లా కోఆర్డినేటర్ సుమలత, చైల్డ్ ప్రొటెక్షన్ ఆఫీసర్ సౌరం ప్రవీణ్ కుమార్, అంగన్వాడీ టీచర్లు తదితరులు పాల్గొన్నారు.

# యోగ సాధనతో సంపూర్ణ ఆరోగ్యం

- **ప్రతి ఒక్కరూ నిత్యజీవితంలో యోగాను భాగంగా చేసుకోవాలి**
- **వరంగల్ కలెక్టర్ డా. సత్య శారద**

**వరంగల్ ప్రతినిధి,10 ఏప్రిల్, తరంగాలు :** నిత్య యోగా సాధనతో సంపూర్ణ ఆరోగ్యంతో పాటు మానసిక ప్రశాంతత సిద్ధిస్తుందని జిల్లా కలెక్టర్ డా. సత్య శారద అన్నారు.ప్రజాపాలన--ప్రగతి 99 రోజుల కార్యాచరణ ప్రణాళికలో భాగంగా ఆరోగ్య థీమ్ -- 5వ రోజు సందర్భంగా శుక్రవారం "ప్రపంచ హోమియోపతి దినోత్సవం, ఆయుష్ దినోత్సవం" వేడుకలు ఖిలా వరంగల్‌లో ఘనంగా నిర్వహించబడ్డాయి. ఉదయం



స్వయంభూ దేవాలయం వద్ద నిర్వహించిన యోగ ప్రదర్శనలో జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద స్వయంగా యోగ ఆసనాలు చేసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, యోగ సాధన ద్వారా శారీరక, మానసిక ఆరోగ్యం మెరుగుపడటంతో పాటు జీవనశైలి సంబంధిత వ్యాధులను నివారించుకోవచ్చని తెలిపారు. ప్రతి ఒక్కరూ నిత్యజీవితంలో యోగను భాగంగా చేసుకోవాలని పిలుపునిచ్చారు.ఈ సందర్భంగా కలెక్టర్ డాక్టర్ శామ్యూల్ హనుమాన్ (ఫాదర్ ఆఫ్ ఆయుష్) జయంతిని పురస్కరించుకుని ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఖిలా వరంగల్‌లోని ముదిరాజ్ భవన్‌లో ఏర్పాటుచేసిన ఆయుష్ హెల్త్ క్యాంప్‌ను కలెక్టర్ ప్రారంభించారు. ఈ శిబిరంలో ఆయుష్ వైద్యులు ప్రజలకు ఉచిత వైద్య సేవలు అందించారు.ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు ఉమా దామోదర్ యాదవ్, భోగి సువర్ణ, అదనపు కలెక్టర్ సంధ్యారాణి, జెడ్పి సీఈఓ రామ్ రెడ్డి, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డా. సాంబశివరావు, జిల్లా ఇన్‌చార్జ్ ఎం. రాజు, డీపీఎం రాజు, నేచురోపతి మెడికల్ ఆఫీసర్



డా. అమృత వల్లి, ఆయుష్ వైద్యులు డా. రాజేందర్, డా. రాము, డా. శ్రీలత, అధికారులు, ప్రజాప్రతినిధులు, నర్సులు మరియు ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# యోగాను నిత్య జీవితంలో భాగం చేసుకోవాలి

- **హన్మకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి**







**హన్మకొండ ప్రతినిధి,: 10 ఏప్రిల్, తరంగాలు :** సంపూర్ణ ఆరోగ్యం యోగతోనే సాధ్యమని,యోగాను నిత్య జీవితంలో భాగం చేసుకోవాలి హన్మకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి అన్నారు.రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ప్రజా పరిపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా హనుమకొండ జిల్లాలో వైద్య ఆరోగ్య, ఆయుష్ శాఖ ఆధ్వర్యంలో ఉచిత యోగ శిబిరం,యోగ అవగాహన కార్యక్రమం ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి హాజరై ప్రారంభించి, స్వయంగా యోగాసనాలు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, యోగా మన భారతీయ సంస్కృతిలో అంతర్భాగమని, మన దేశంలో పుట్టిన యోగా విధానం నేడు ప్రపంచవ్యాప్తంగా విస్తరించి, అంతర్జాతీయ స్థాయిలో కూడా ప్రాముఖ్యత పొందిందన్నారు. యోగా దినోత్సవాన్ని ప్రపంచ దేశాలు జరుపుకోవడం మన సంస్కృతి గొప్పతనానికి నిదర్శనమని పేర్కొన్నారు. లండన్ వంటి విదేశీ నగరాల్లో కూడా చిన్నారులకు వారానికి ఒక రోజు యోగా తరగతులు నిర్వహించడం జరుగుతుండటం, యోగా ప్రాముఖ్యతను స్పష్టంగా తెలియజేస్తోందన్నారు. యోగ సాధన ద్వారా శారీరక, మానసిక ఆరోగ్యం మెరుగుపడటంతో పాటు జీవనశైలి సంబంధిత వ్యాధులను నివారించుకోవచ్చని తెలిపారు. ప్రత్యేకంగా మహిళలు, ముఖ్యంగా ముప్పై సంవత్సరాలు దాటిన వారు తప్పనిసరిగా యోగాను అలవాటు చేసుకోవాలని సూచించారు. యోగా చేయడం ద్వారా ఆరోగ్యవంతమైన జీవనం సాధ్యమవుతుందని, మందులపై ఆధారపడే అవసరం తగ్గుతుందని కలెక్టర్ తెలిపారు.హోమియోపతి పితామహుడు డాక్టర్ క్రిస్టియన్ ఫ్రెడరిక్ శామ్యూల్ హానీమన్ జయంతి మరియు ఆయుష్ దినోత్సవం సందర్భంగా వడ్డేపల్లి పార్క్‌లో ఆ మహనీయుని చిత్ర పటానికి కలెక్టర్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఉచిత హోమియో, ఆయుర్వేద వైద్య సేవలతో మెగా హెల్త్ క్యాంప్ నిర్వహించారు. ఈ శిబిరాన్ని కార్పొరేటర్ దాస్యం అభినయ భాస్కర్ ప్రారంభించగా, డిఎం హెచ్ ఓ డాక్టర్ అప్పయ్య ఆయుష్ వైద్య సేవల విశిష్టతను వివరించారు. అనంతరం వైద్యులు రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా హోమియో మరియు ఆయుర్వేద మందులను అందజేశారు.ఈ శిబిరంలో మొత్తం 453 మంది రోగులకు వైద్య సేవలు అందించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ అభినవ్ భాస్కర్, ఆయుష్ జిల్లా ఇన్‌చార్జ్ డాక్టర్ ఎస్. మహేంద్ర కుమార్ , జిల్లా ప్రోగ్రాం మేనేజర్ భాను కుమార్,డిఎం హెచ్ఓ డాక్టర్ అప్పయ్య, డిపిఆర్ ఓ ఆయుబ్ అలీ, వైద్యులు డాక్టర్ జగదీశ్వర్ ప్రసాద్, డాక్టర్ రజిత, డాక్టర్ శోభ, డాక్టర్ కిరణ్ కుమార్, ఫార్మసిస్ట్ సిబ్బంది పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించారు.



## ఆసరా పెన్షన్లకు దరఖాస్తు చేసుకోవాలి



**మహమ్మద్ పట్నం కాంగ్రెస్ గ్రామ పార్టీ అధ్యక్షులు మిట్టగడుపుల యాకూబ్**

**కేసముద్రం,మహబూబాబాద్ జిల్లా, ప్రతినిధి, ఏప్రిల్. 10,తరంగాలు**:కేసముద్రం మండలంలో మహమ్మద్ పట్నం పరిధిలో ఉన్న ప్రజల్లో అర్హులైన వారు ఆసరా పెన్షన్ల కోసం దరఖాస్తు చేసుకోవాలని మహమ్మద్ పట్నం కాంగ్రెస్ గ్రామ పార్టీ అధ్యక్షులు అధ్యక్షులు మిట్టగడుపుల యాకూబ్ కోరారు.కావాల్సిన డాక్యుమెంట్లు: పెన్షన్ దరఖాస్తు ఫామ్ ఆధార్ కార్డు ఓటర్ ఐడి బ్యాంకు పాస్‌బుక్ రేషన్ కార్డు ఆయా పెన్షన్లకు అవసరమైన ఇతర ధృవపత్రాలుఈ పత్రాలతో గ్రామపంచాయతీ కార్యాలయంలో దరఖాస్తు సమర్పించాలని యాకూబ్ తెలిపారు.

## మక్కల కొనుగోలు కేంద్రం పరిశీలన

- రైతులకు ఇబ్బందులు లేకుండా చర్యలు
- మద్దతు ధర అమలుపై సమీక్ష
- పారదర్శకంగా కొనుగోళ్లు చేయాలి
- రైతులకు న్యాయమైన ధరలు అందిస్తాం
- వేగవంతమైన కొనుగోలు ప్రక్రియపై దృష్టి



**తొర్రూరు ఏప్రిల్ 10 తరంగాలు**
రైతులకు ఇబ్బందులు లేకుండా పంట విక్రయం జరిగేలా చర్యలు తీసుకోవాలని మార్కెట్ కమిటీ చైర్మన్ అనుమండ్ల తిరుపతి రెడ్డి అధికారులను ఆదేశించారు. శు క్రవారం తొర్రూర్ వ్యవసాయ మార్కెట్ యార్డ్‌లో ఏర్పాటు చేసిన మక్కల కొనుగోలు కేంద్రాన్ని ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా కొనుగోలు ప్రక్రియ, తూకం విధానం, రైతులకు అందుతున్న సౌకర్యాలు, మద్దతు ధర అమలు వంటి అంశాలను సమీక్షించారు. రైతులు ఎటువంటి ఇబ్బందులు లేకుండా తమ పంటను విక్రయించుకునేలా అన్ని ఏర్పాట్లు సక్రమంగా ఉండాలని సూచించారు.పాలకవర్గ సభ్యులతో కలిసి కేంద్రాన్ని పరిశీలించిన చైర్మన్, రైతులకు న్యాయమైన ధరలు అందేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. మార్కెట్ యార్డ్‌లో పారదర్శకత, వేగవంతమైన కొనుగోలు ప్రక్రియపై ప్రత్యేక దృష్టి పెట్టాలని అధికారులను ఆదేశించారు.ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ బట్టు నాయక్, సభ్యులు, స్థానిక నాయకులు, రైతులు పాల్గొన్నారు.

## గ్యాస్ సిలిండర్ల గురించి ప్రజలు అధైర్య పడొద్దు

- తొర్రూరు తాసిల్దార్ గడీల శ్రీనివాస్
- పట్టణ కేంద్రంలోని భారత్ గ్యాస్ గోదాం ను తహసిల్దార్ ఆకస్మిక తనిఖీ.



**తొర్రూరు ఏప్రిల్ 10 తరంగాలు**
తొర్రూరు ప్రాంత పరిధిలోని ప్రజలు గ్యాస్ సిలిండర్ల గురించి అధైర్య పడద్దని గ్యాస్ గోదాంలో అందరికీ సరిపడా స్టాకు ఉందని తొర్రూరు తహసిల్దార్ గడీల శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం తొర్రూరు పట్టణ కేంద్రంలోని దుబ్బ తండాలో ఉన్న భారత్ గ్యాస్ గోదామును తహసిల్దార్ ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. గ్యాస్ ఏజెన్సీ వారితో ఉన్న స్టాకు వివరాలు పంపిణీ చేసే ట్రాలీ ఆటోల వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తొర్రూరు ప్రాంత ప్రజలు ఎవరు అధైర్య పడవద్దని అందరికీ సరిపడా గ్యాస్ సిలిండర్లు స్టాకు ఉన్నాయని తెలిపారు. గ్యాస్ కోసం లబ్ధిదారుడు బుక్ చేసుకున్న పది రోజులలో కచ్చితంగా గ్యాస్ ఏజెన్సీ వారు ఇంటికి తీసుకువచ్చి ఇస్తారని అన్నారు. గ్యాస్ సిలిండర్ దొరకదేమో అనే అపోహలకు పోయి ముందస్తుగా గ్యాస్ కార్యాలయానికి వెళ్లి ఏజెన్సీ వారిని మీరు ఇబ్బందులు పడొద్దని ప్రజలకు సూచించారు. గురువారం బుధవారం రెండు రోజులు ర్యాలీ ఆటోల ప్రాబ్లంతో కొంత పంపిణీ జాప్యం జరిగిన మాట వాస్తవమేనని ప్రస్తుతం ఇతర ఆటోలను డ్రైవర్లను మాట్లాడి గ్యాస్ సిలిండర్ల పంపిణీకి ఎలాంటి ఇబ్బందులు లేకుండా జాప్యం లేకుండా బుక్ చేసుకున్న 8 రోజుల నుండి పది రోజుల వ్యవధిలో ఇంటి వరకు తీసుకొచ్చి పంపిణీ చేస్తారని అన్నారు.ఈ తనిఖీలలో రెవెన్యూ ఇన్స్పెక్టర్ చిన్ని వెంకటేష్, జిపిఓ విజయ్ కుమార్, భారత్ గ్యాస్ కార్యాలయ సిస్టం ఆపరేటర్ సునీల్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# మానసిక దివ్యాంగ చిన్నారులతో జన్మదిన వేడుకలు జరుపుకున్న వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య



**వరంగల్ ప్రతినిధి, ఏప్రిల్ 10,తరంగాలు**:హనుమకొండ కనకదుర్గ కాలనీలోని ఎంపీ క్యాంప్ కార్యాలయంలో వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య తన జన్మదిన వేడుకలను మల్లికాంబ మనోవికాస కేంద్రానికి చెందిన మానసిక దివ్యాంగ చిన్నారుల సమక్షంలో కేక్ కట్ చేసి వేడుకలను ఆనందోత్సాహాల మధ్య జరుపుకున్నారు. ఈ సందర్భంగా చిన్నారులను ఆప్యాయంగా పలకరించిన ఎంపీ డాక్టర్ కడియం కావ్య చిన్నారుల ఆరోగ్య పరిస్థితులు, చదువులు, వారి ఆసక్తులు గురించి అడిగి తెలుసుకున్నారు. అనంతరం చిన్నారులకు స్వయంగా స్వీట్లు తినిపించి, వారితో సన్నిహితంగా మమేకమయ్యారు.చిన్నారులు తమ చేతులతో తయారు చేసిన కళాకృతులను ఎంపీకి బహుమతిగా అందజేయగా, వాటిని స్వీకరించిన ఎంపీ వారికి అభినందనలు తెలిపారు.ఈ సందర్భంగా వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య మాట్లాడుతూ, మానసిక దివ్యాంగ చిన్నారులతో కలిసి జన్మదిన వేడుకలు జరుపుకోవడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. సమాజంలో ప్రతి ఒక్కరూ ఇలాంటి పిల్లలకు ప్రేమ, ఆదరణ, ప్రోత్సాహం అందించాలని ఎంపీ పిలుపునిచ్చారు.
ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, మల్లికాంబ మనోవికాస కేంద్రం నిర్వాహకులు పాల్గొని ఎంపీ గారికి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.



# మార్కెట్లో డిమాండ్ ఉన్న పంటలను పండించాలి



- నూతన రైతులకు ఆయిల్ పామ్ సాగు పై అవగాహన కల్పిస్తున్నాము
- ఆయిల్ పామ్ ఒ ఉద్యాన పంటల సాగు లాభదాయకం పంట మార్పిడితో అధిక ఆదాయం
- ఆయిల్ పామ్ సాగు పై అవగాహన మరియు క్షేత్ర సందర్శన

**కేసముద్రం,మహబూబాబాద్ జిల్లా, ప్రతినిధి ,ఏప్రిల్. 10,తరంగాలు** :మహబూబాబాద్ జిల్లా ఉద్యాన మరియు పట్టుపరిశ్రమ శాఖ, గ్రామ గ్రామాన ప్రచార కార్యక్రమాలునూతన రైతులకు ఆయిల్ పామ్ సాగు పై అవగాహన కార్యక్రమం నిర్వహించడం జరిగింది.ఆయిల్ పామ్ ఒ ఉద్యాన పంటల సాగు లాభదాయకం పంట మార్పిడితో అధిక ఆదాయం ఆయిల్ పామ్ సాగు పై అవగాహన మరియు క్షేత్ర సందర్శన కాల్వల గ్రామంలో నిర్వహించారు.రైతులను వరి, పత్తి, మొక్కజొన్న, మిరప వంటి పంటల నుండి పంట మార్పిడి చేయించి లాభాలను ఇచ్చే ఆయిల్ పామ్, పండ్లు, కూరగాయలు, మునగ, పూలు, మల్బరీ, తేనెటీగలు పెంపకం, పుట్టగొడుగుల పెంపకం మొదలైన మార్కెట్ డిమాండ్ గల వాటిని సాగు చేయాలని నాడు కల్వల గ్రామం కేసముద్రం మండలం వద్ద ఆయిల్ పామ్ పై అవగాహన మరియు ప్రదర్శన క్షేత్ర సందర్శన ను సేనాల శ్రీపాల్ రెడ్డి ఆయిల్ పామ్ తోటలో నిర్వహించనైనది.రైతులను ఉద్దేశించి జిల్లా ఉద్యాన మరియు పట్టు పరిశ్రమ శాఖ అధికారి జినుగు మరియన్న తో పాటు పలువురు మాట్లాడుతూ ప్రభుత్వ రాయితీలు, కూరగాయల పందిళ్ళు, మల్చింగ్, కోల్డ్ రూమ్స్, నిల్వ గిడ్డంగులు, షేడ్ నెట్ హౌస్లు, ఆయిల్ పామ్ రాయితీ, మార్కెటింగ్ వసతులు, మల్బరీ రాయితీలు పొందాలని తెలిపినారు. రైతులు నీటి ఒ భూసార పరీక్షలు చేయించుకోవాలి, ప్రకృతి సేద్యం అవలంభించాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ వేల్పుల సుజాత, వ్యవసాయ మార్కెట్ కమిటి చైర్మెన్ గంట సంజీవ రెడ్డి, జిల్లా రవాణ కమిటి డైరెక్టర్ రావుల మురళి మరియు అభ్యుదయ రైతుల అమృత హస్తాలతో పంట మార్పిడి ద్వారా ఆయిల్ పామ్ ఒ ముల్బరి సాగు పై కర పత్రాలు మరియు డైరీలు ఆవిష్కరించనైనది.అదేవిదంగా ప్రకృతి వ్యవసాయం సాగు చేస్తున్న కల్వల క్లస్టర్ రైతులకు భుసారా పరీక్ష పత్రాలు అందచేయడం జరిగింది.ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ వేల్పుల సుజాత, జిల్లా ఉద్యాన మరియు పట్టు పరిశ్రమ శాఖ అధికారి జినుగు మరియన్న, వ్యవసాయ మార్కెట్ కమిటి చైర్మెన్ గంట సంజీవ రెడ్డి, జిల్లా ట్రాన్స్పోర్ట్ అథారిటీ మెంబర్ రావుల మురళి, వ్యవవసాయ సహాయ సంచాలకుడు ఎ. శ్రీనివాస్, ఉద్యాన పరిశోదన స్టానం శాస్త్రవేత్త ప్రశాంత్, ఆయిల్ ఫెడ్ జిల్లా ఇంచార్జ్ సి.హెచ్. రాములు, వ్యవసాయ అధికారి బి.వెంకన్న, ఉద్యాన అధికారి ఎ. జే. శాంతి ప్రియదర్శిని, పట్టు పరిశ్రమ అధికారులు, సురేష్, రాజయ్య, వ్యవసాయ విస్తరణ అధికారులు లావణ్య, సాయి చరణ్, ఉద్యాన ఒ ఆయిల్ ఫెడ్ విస్తరణ అధికారులు,రాజ్ కుమార్, రమేష్, విజయపాల్ రెడ్డి, శ్రీకాంత్, అనిల్, నాగరాజు, నర్మద, రామ్ రంజిత్, కరుణాకర్, బిందు సేద్య ఇంజనీర్ కిషోర్, బిందు సేద్య ప్రతినిధులు అశోక్, ప్రసాద్, శరత్, అగస్టిన్, కారంత్ మరియు అభ్యుదయ రైతులు, వీర రెడ్డి, డా. పాల్వాయి రామ్ మోహన్ రెడ్డి, బొబ్బల యాకుబ్ రెడ్డి, పేరేటి వెంకట్రామనర్సయ్య, మూల అశోక్ రెడ్డి, ముల జైపాల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



## ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల వసతి గృహాన్ని పరిశీలించిన మున్సిపల్ చైర్ పర్సన్ ,వైస్ చైర్ పర్సన్





**కేసముద్రం, మహబూబాబాద్ జిల్లా, ప్రతినిధి,ఏప్రిల్. 10, తరంగాలు**:కేసముద్రం మున్సిపాలిటీ పరిధిలో ఉన్న ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల వసతి గృహాన్ని మున్సిపల్ చైర్ పర్సన్ బానోత్ సునీత వెంకన్న,మున్సిపల్ వైస్ చైర్ పర్సన్ డాక్టర్ అల్లం రమ నాగేశ్వర్ రావు,జిల్లా ట్రాన్స్పోర్ట్ అథారిటీ మెంబర్ రావుల మురళి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా హాస్టల్లో విద్యార్థులు వసతి, ఆహార నాణ్యత, పరిశుభ్రత తదితర అంశాలను పరిశీలించారు.ఈ సందర్భంగా విద్యార్థులు శుభ్రంగా, ఆరోగ్యంగా ఉండేలా చూసుకోవాలని, గౌతమ్ నిర్ణయించిన మెమోను తప్పకుండా అమలు చేయాలని హాస్టల్ వార్డెన్ కు సూచించారు.హాస్టల్ గదులను పరిశుభ్రంగా ఉంచుకోవాలని విద్యార్థులను కోరారు. కష్టపడి చదివి మంచి మార్కులతో ఉత్తీర్ణత సాధించాలని బానోత్ సునీత,డాక్టర్ అల్లం రమ కోరారు.మంచి ఫలితాలు సాధించడం ద్వారా తల్లిదండ్రులకు, ఉపాధ్యాయులకు మంచి పేరు తీసుకురావాలని సూచించారు. కష్టపడి చదివితే భవిష్యత్తులో ఉన్నంత స్థానాలు చేరుకోవచ్చని, సమాజంలో గౌరవం పొందవచ్చును విద్యార్థులకు అవగాహన కల్పించారు.

## సమాజ సేవ చేయడం వలనే గుర్తింపు వస్తుంది

• చైర్మన్ గంట సంజీవరెడ్డి



కేసముద్రం, మహబూబాబాద్ జిల్లా, ప్రతినిధి,ఏప్రిల్.10,తరంగాలు :కేసముద్రం మండలం కొత్తూరు గ్రామంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల నిర్వహిస్తున్న ఎన్ ఎస్ ఎస్ ప్రత్యేక శిబిరం ముగింపు సమావేశానికి ప్రిన్సిపల్ డా.డి. రాజు అధ్యక్షత వహించగా ముఖ్యఅతిథిగా కేసముద్రం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ గంట సంజీవరెడ్డి హాజరయ్యారు. సంజీవ రెడ్డి మాట్లాడుతూ సామాజిక సేవ చేయడం చాలా మంచిదని మేము చదువుకునే రోజుల్లోనే ఇలాంటి కార్యక్రమాల్లో పాల్గొని అవగాహన కల్పించుకోవడం వల్లనే గత 40 సంవత్సరాలుగా రాజకీయాల్లో ఉండి ప్రజలకు సేవ చేస్తున్నానని చైర్మన్ అన్నారు. కేసముద్రం తహసీల్దార్ వివేక్ మాట్లాడుతూ విద్యార్థుల ఇలాంటి సేవా కార్యక్రమాలు చేయడం చాలా మంచిదని విద్యార్థులను అభినందించారు.ఎంపీడీవో క్రాంతి, మాట్లాడుతూ సామాజిక సేవ కార్యక్రమాలు, ఇలాంటి శిబిరాల అలవర్చుకొని వాటి ద్వారా ఉన్నతమైన చదువులు చదివి ప్రజలకు సేవ చేయాలని, ఉన్నతమైనటువంటి ఉద్యోగాలు సంపాదించాలని విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. సర్పంచ్ సారంపల్లి దేవేంద్ర మోహన్ రెడ్డి,మా ఊరిలో గత ఏడు రోజులుగా సేవలందించిన ఎన్ఎస్ఎస్ వాలంటీర్లకు , ప్రిన్సిపల్ కు, పిఓ రమేష్ నాయక్,అధ్యాపక బృందానికి ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎం పి ఓ హరీష్, ఎన్ఎస్ఎస్ కన్వీనర్ అనిల్, పంచాయతీ కార్యదర్శి నాగార్జున,ఉప సర్పంచ్ ఆలు నాయక్, ఎం ఆర్ పి ఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి అరుణ్, ఈ కార్యక్రమంలో ముందుగా ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి డా. జి రమేష్ నాయక్.గ్రామ యూత్ నాయకులు ఉదయ్,రుషికేశ్ రెడ్డి ,వైస్ ప్రిన్సిపల్ మైసయ్య,ప్రవీణ్, యాదగిరి,రవి, రాజు, మున్ని,రమాదేవి, మంజుల, సలీం మరియు బోధనేతర సిబ్బంది విద్యార్థిని, విద్యార్థులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో పూరిల్లు దగ్ధం



**తరంగాలు ఖమ్మం జిల్లా బ్యూరో** : మండలంలోని ఏన్కూరు చెరువు బజార్ ప్రాంతంలో శుక్రవారం మధ్యాహ్నం విద్యుత్ షార్ట్ సర్క్యూట్ తో పూరీలు దగ్ధమైన ఘటన చోటుచేసుకున్నది .అగ్ని ప్రమాదం స్థానికంగా కలకలం రేపింది. గ్రామానికి చెందిన లేల వెంకమ్మ సుక్కులు నివాస గృహం విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా ఒక్కసారిగా మంటలు అంటుకుని పూరిల్లు దగ్ధమైంది. సమాచారం ప్రకారం, శుక్రవారం మధ్యాహ్నం సుమారు ఒక గంట సమయంలో ఈ ఘటన జరిగింది. ఆ సమయంలో ఇంట్లో ఎవరూ లేకపోవడంతో పెద్ద ప్రమాదం తప్పింది. అయితే, ఇంటిలో ఉన్న సామాన్లు, గృహోపకరణాలు పూర్తిగా అగ్నికి ఆహుతయ్యాయి. మంటలు ఎగసిపడుతుండటాన్ని గమనించిన స్థానికులు వెంటనే స్పందించి విద్యుత్ సరఫరాను నిలిపివేసి, నీటితో మంటలను ఆర్పేందుకు ప్రయత్నించారు. వారి చొరవతో అగ్ని మరింత వ్యాపించకుండా అదుపులోకి తీసుకువచ్చారు. ఈ ఘటనతో బాధిత కుటుంబం తీవ్ర ఆందోళనకు గురైంది.

## గ్రామాలలో మొక్కజొన్న ఐకెపి సెంటర్లు తక్షణమే ప్రారంభించాలి

**జఫర్గడ్ ప్రతినిధి, ఏప్రిల్ 10,(తరంగాలు)** మండలంలోని అన్ని గ్రామాలలో మొక్కజొన్న, ఐకెపి, పాక్స్ సెంటర్లను తక్షణమే ప్రారంభించాలి. సిపిఎం డిమాండ్ శుక్రవారం రోజున సిపిఎం మండల కమిటీ ఆధ్వర్యంలో తహసిల్దార్కి వినతి పత్రం ఇవ్వడం జరిగింది.ఈ కార్యక్రమానికి గుండెబోయిన రాజు అధ్యక్షత వహించగా ముఖ్య అతిథిగా సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు రాపర్తి సోమయ్య మాట్లాడుతూ ప్రభుత్వం వరి పంటలు తగ్గించి ఆరుతడి పంటలు వేసుకోమని అధిక లాభాలు పొందాలని అనేకమార్లు చెప్పడం జరిగింది.చాలామంది రైతులు మొక్కజొన్న వేసి ప్రభుత్వం 2400 గిట్టుబాటు ధర కల్పిస్తుందని ఆశతో ఉన్నారు.మొక్కుబడిగా కొన్ని సెంటర్లు మాత్రమే ప్రారంభించారని అలా కాకుండా అన్ని గ్రామాలలో ప్రారంభించాలని మక్కలు ముక్కులు కలిగినవని సన్నగా ఉన్నాయని అనేక సాకులు చెబుతూ రైతులను ఇబ్బందులు గురి చేస్తున్నారు ఎలాంటి షరతులు లేకుండా కొనుగోలు చేయాలని ఇప్పటికే వరి కోతలు మొదలైన కూడా ఐకెపి సెంటర్లు జాడలేవు ఇదే అదునుగా మధ్య దళారులు కారు చౌకగా కొనుగోలు చేస్తూ రైతులను ఇబ్బందులకు గురి చేస్తున్నారు. తక్షణమే ప్రభుత్వ అధికారులు ప్రజాప్రతినిధులు స్పందించి ఐకేపీ సెంటర్లను ప్రారంభించాలని రైతులకు గిట్టుబాటు ధర కల్పించి ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మండల నాయకులు కాటా సుధాకర్,నక్క యాకయ్య, నాయకులు సఖి నరసింహ,చిరంజీవి, పులిగిల్ల నాగరాజు, జాఫర్, తదితరులు పాల్గొన్నారు.



## టీజీఈజేఏసీ ఆధ్వర్యంలో జెడ్.ఎస్ జైపాల్, "దళిత రత్న" కోటపాటి.రుక్మారావుకు ఘన సన్మానం



**తరంగాలు ఖమ్మం జిల్లా బ్యూరో** : టీ జీ ఈ జే ఏసీ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో, టీఎన్జీవోస్ కేంద్ర సంఘం ఆర్గనైజింగ్ సెక్రటరీ గా ఎన్నికైన జెడ్.ఎస్. జైపాల్ మరియు రాష్ట్ర ప్రభుత్వ "దళిత రత్న" అవార్డు గ్రహీత కోటపాటి రుక్మారావు లను ఘనంగా సన్మానించారు. శాలువాలు కప్పి, పుష్పగుచ్ఛాలు అందజేసి వారి సేవలను కొనియాడారు. ఈ సందర్భంగా టీజీఈజేఏసీ రాష్ట్ర సెక్రటరీ జనరల్ ఉ టీజీవో రాష్ట్ర అధ్యక్షులు ఏలూరి శ్రీనివాసరావు మాట్లాడుతూ, జైపాల్ ఉద్యోగుల హక్కుల పరిరక్షణలో నిరంతరం పోరాడుతూ సంఘ బలోపేతానికి విశేష కృషి చేస్తున్నారు. నాయకత్వం ఉద్యోగుల్లో ఐక్యత, నమ్మకాన్ని పెంపొందించింది అని ప్రశంసించారు. అలాగే, రాష్ట్ర ప్రభుత్వ "దళిత రత్న" అవార్డు గ్రహీత కోటపాటి రుక్మారావు విద్యార్థుల సంక్షేమం, సామాజిక సేవలో విశేష కృషి చేసి, ముఖ్యంగా పేద మరియు వెనుకబడిన వర్గాల అభ్యున్నతికి అంకితభావంతో పనిచేస్తున్నారు. సేవలు యువతకు ఆదర్శప్రాయంగా నిలుస్తాయి అని పేర్కొన్నారు. ఇలాంటి ప్రతిభావంతులైన నాయకులను సన్మానించడం ద్వారా సంఘం మరింత బలపడుతుందని, వారి సేవలు సమాజానికి దిశానిర్దేశం చేస్తాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో టీజీఈజేఏసీ ఖమ్మం జిల్లా చైర్మన్ గుంటుపల్లి శ్రీనివాసరావు, టీజీవో జిల్లా అధ్యక్షులు కొంగర వెంకటేశ్వరావు, కార్యదర్శి మోదుగు వేలాద్రి, టీఎన్జీవోస్ జిల్లా కార్యదర్శి కొనిదెన శ్రీనివాస్, అసోసియేటెడ్ ప్రెసిడెంట్ కొమరగిరి దుర్గాప్రసాద్, రెవిన్యూ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు తుంబూరు సునీల్ రెడ్డి, టీజీవో అసోసియేట్ అధ్యక్షులు మల్లెల రవీంద్ర ప్రసాద్, హౌస్ బిల్డింగ్ సొసైటీ కార్యదర్శి విజయ్ కుమార్, యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి పారుపల్లి నాగేశ్వరావు, పిఆర్టియు జిల్లా అధ్యక్షులు కట్టా శేఖర్, పెన్షనర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు సుబ్బయ్య, హెడ్ మాస్టర్స్ అసోసియేషన్ అధ్యక్షులు వీరాస్వామి, టీపీటీఫ్ కార్యదర్శి వెంగలరావు, యుటిఎఫ్ అధ్యక్షులు రంజాన్, టిఆర్టియు అధ్యక్ష కార్యదర్శులు శేఖర్, టీఎన్జీవోస్ మహిళా విభాగం చైర్‌పర్సన్ మృదుల, నాయకులు తాళ్లూరి శ్రీకాంత్, ఎర్రమళ్ళ శ్రీనివాసరావు, కోణార్, శ్రీధర్ సింగ్, కోడి లింగయ్య, వెక్కిరాల శ్రీనివాస్, మల్లోజు వెంకన్న, పొట్టపెంజర రామయ్య, డి ఆర్ డి ఏ.లక్ష్మణరావు, కెవి.రమణ, రవికుమార్, తాళ్లూరు చంద్రశేఖర్, గుడిపూడి శ్రీనివాస్, రమణ యాదవ్, ఎర్రమల శ్రీనివాస్, చంద్రశేఖర్ గౌడ్, ఎర్ర రమేష్, బెజ్జంకి ప్రభాకర చారి, మెట్టు వీరన్న, దిలీప్ కుమార్, విజయ్, అజ్మత్ బెగ్, గఫూర్, లింగం సురేష్ తదితరులు పాల్గొని సన్మానితులకు అభినందనలు తెలిపారు. కార్యక్రమం ఉత్సాహభరిత వాతావరణంలో ఘనంగా జరిగింది.

## జిల్లా వ్యాప్తంగా విస్తృతంగా పోలీస్ తనిఖీలు




• పోలీస్ కమిషనర్ సునీల్ దత్

**తరంగాలు ఖమ్మం జిల్లా బ్యూరో** : నేరాల నియంత్రణలో భాగంగా అక్రమ రవాణా, చట్టవ్యతిరేక కార్యకలాపాలను కట్టడి చేసేందుకు జిల్లా పోలీస్ యంత్రాంగం జిల్లా వ్యాప్తంగా విస్తృత తనిఖీలు నిర్వహిస్తున్నారని పోలీస్ కమిషనర్ సునీల్ దత్ తెలిపారు. ఏటియం సెంటర్లు, బ్యాంకుల పరిసరాలలో పోలీస్ పెట్రోలింగ్ నిర్వహించారు. అర్ధరాత్రి వేళలో అనుమానాస్పద వ్యక్తుల కదలికలను, వాహనాలను తనిఖీ చేశారు. అదేవిదంగా సరిహద్దు రాష్ట్రాల మీదుగా ఇసుక, గంజాయి , రేషన్ బియ్యం వంటి అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేసేందుకు జిల్లా పోలీస్ యంత్రాంగం వాహన తనిఖీలు ముమ్మరం చేసినట్లు తెలిపారు. సరిహద్దు రాష్ట్రాల నుండి అక్రమంగా తరలిస్తున్న ఇసుక లారీలపై కేసులు నమోదు చేయాలని ఆదేశించారు. రవాణా శాఖ నిబంధనలు ఉల్లంఘించిన ధ్రువీకరణ పత్రాలు లేని వాహనాలపై కేసులు నమోదు చేయడంతో పాటు జరిమానాలు విధిస్తున్నామన్నారు.అదేవిధంగా మద్యం మత్తులో వాహనాలు వాహనాలు నడుపుతూ రోడ్డు ప్రమాదాలకు గురవుతున్న నేపథంలో డ్రంక్ అండ్ తనిఖీలు ముమ్మరం చేశారు. పట్టుబడిన వారిపై కేసు నమోదు చేశారు. దొంగతనాలు జరగకుండా పాత నేరస్తుల కదలికలను కట్టడి చేసేలా అన్ని పోలీస్ స్టేషన్ పరిధిలో పోలీసు అధికారులు విస్తృతంగా తనిఖీలు నిర్వహిస్తున్నారు. అనుమానిత వ్యక్తులు గాని, వాహనాలు గాని తారసపడితే వాటి గురించి పూర్తి వివరాలను సేకరించి, అనంతరం వారికి వెసులుబాటు కల్పిస్తున్నారు.




## నాణ్యత ప్రమాణాలు పాటించి అధిక మద్దతు ధర పొందాలి





**కేసముద్రం, మహబూబాబాద్ జిల్లా, ప్రతినిధి,ఏప్రిల్. 10, తరంగాలు**:కేసముద్రం మండలం వ్యవసాయ మార్కెట్ యందు తెలంగాణా ప్రభుత్వం మార్క్ఫెడ్ ఆధ్వర్యంలో కొనుగోలు చేస్తున్న మొక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని జిల్లా వ్యవసాయ అధికారి బి.సరిత,సహాయ వ్యవసాయ సంచాలకులు, మహబూబాబాద్ డివిజన్ అజ్మీరా శ్రీనివాస్ రావు మరియు వ్యవసాయ మార్కెట్ సెక్రెటరీ కేసముద్రం అమరాలిగేశ్వరావు, వ్యవసాయ అధికారి కేసముద్రం బి. వెంకన్న ,ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ధనసరి సీఈవో జి.మల్లారెడ్డి తో కలిసి మొక్కజొన్న కొనుగోలు సెంటర్ ను సందర్శించడం జరిగింది. వారు రైతులు, రైతు సంఘము నాయకులతో మార్కెట్ రైతులు ఎదుర్కొంటున్న సమస్య ల మీద చర్చించడం జరిగింది. రైతులు మాట్లాడుతూ, కేసముద్రం మార్కెట్ లో చుట్టూ ప్రక్క మండలాల నుండి అధిక మొత్తం లో ధాన్యం తెస్తున్నందున రద్దీ ఎక్కువగా ఉన్న దృష్ట్యా అదనంగా 3 కొనుగోలు సెంటర్స్ ఏర్పాటు చేయాలనీ, మొక్కజొన్న కొనుగోలు ఎకరాకు 26 .50 క్వింటాల నుండి 35 క్వింటలకు పెంచాలని కోరారు.జిల్లా వ్యవసాయ అధికారి మాట్లాడుతూ కొనుగోలు సెంటర్ లో రైతులు తెలియపరచిన సమస్యలను, జిల్లా కలెక్టర్ దృష్టికి, ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లుతానని సమస్య లు పరిస్కారమయ్యే విధంగా కృషి చేస్తానని రైతులకు తెలియపరచారు. ధాన్యాన్ని కొనుగోలు సెంటర్ కు తీసుకువచ్చేటప్పుడు తీసుకోవలసిన నాణ్యత ప్రమాణాల మీద పలు సూచనలు చేయడం జరిగింది.రైతులు మొక్కజొన్న ధాన్యాన్ని కొనుగోలు సెంటర్కు తీసుకొచ్చేటప్పుడు 14% లోపు తేమ, వచ్చేటట్టుగా చూసుకొని మట్టి పెళ్ళలు , తాలు,చెత్తా చెదారం మరియు బూజు పట్టని నాణ్యమైన మొక్కజొన్న ధాన్యాన్ని తీసుకొచ్చి ప్రభుత్వం కల్పించిన మద్దతు ధర క్వింటాకు రూపాయలు 2,400 పొందాలని వారు సూచించారు.ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారి డి. రాజేందర్ మరియు సెంటర్ ఇంచార్జీలు, రైతులు పాల్గొన్నారు.

జాతీయ దిన పత్రిక
తరంగాలు
THARANGALU DAILY NEWS
శనివారం, 11 ఏప్రిల్, 2026


## వార్డు సభ్యులకు ముగిసిన శిక్షణ తరగతులు
## అభినందించిన ఎంపీడీఓ రాజారావు



**పాలేరు ఆర్సీ, ఏప్రిల్ 10 (తరంగాలు) :** గ్రామీణాభివృద్ధి, పారదర్శక పరిపాలన, పంచాయితీ రాజ్ వ్యవస్థలో వార్డు సభ్యుల పాత్రపై అవగాహన కల్పించేందుకు తెలంగాణ ప్రభుత్వం శిక్షణ కార్యక్రమం ఏర్పాటు చేసిందని కూసుమంచి ఎంపిడిఓ రాజారావు అన్నారు. మండలంలోని గట్టుసింగారం రైతు వేదికలో శుక్రవారం నిర్వహించిన పలు గ్రామ పంచాయితీల వార్డు సభ్యుల శిక్షణా కార్యక్రమం శు క్రవారంతో ముగిసింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధి కోసం ప్రణాళికలు రూపొందించడం, నిధుల వినియోగం, ప్రజా సమస్యల పరిష్కారం,పారిశుధ్య చర్యలు సంక్షేమ పథకాల అమలు అంశాలపై శిక్షకుల ద్వారా సభ్యులకు వివరించినట్లు వెల్లడించారు. ప్రజలతో సమన్వయం పెంపొందించుకుని పారదర్శకంగా పని చేయాలని సభ్యులకు సూచించారు. శిక్షకులుగా వ్యవహరించిన పంచాయితీ కార్యదర్శులు కొత్తపల్లి ఉపేందర్, రాజేష్, సాలె ఉపేందర్ ను ప్రత్యేకంగా అభినందిస్తూ, వార్డు సభ్యులకి శిక్షణా సర్టిఫికెట్లను అందజేశారు. ఈ కార్యక్రమంలో పలువురు వార్డు సభ్యులు, కార్యదర్శులు, తదితరులు పాల్గొన్నారు.

## ఇ.వి. సతీష్ కుమార్ భౌతిక దేహానికి
## ఈగ మల్లేశం నివాళి



**హన్మకొండ ప్రతినిధి, ఏప్రిల్ 10,తరంగాలు** :ఇ.వి. సతీష్ కుమార్ భౌతిక దేహానికి కేంద్ర ఖాదీ మరియు చిన్న పరిశ్రమల పూర్వ డైరెక్టర్ ఈగ మల్లేశం నివాళులర్పించి, బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. టీపీసీసీ ప్రధాన కార్యదర్శి, రెడ్ క్రాస్ సొసైటీ రాష్ట్ర పాలక మండలి సభ్యుడు ఇ.వి. శ్రీనివాస్ రావు సోదరుడు, తెలుగు యువత రాష్ట్ర నాయకుడిగా సేవలందించిన ఇ.వి. సతీష్ కుమార్ (56) గురువారం అనారోగ్యంతో మృతి చెందాడు.విషయం తెలుసుకున్న కేంద్ర ఖాదీ మరియు చిన్న పరిశ్రమల పూర్వ డైరెక్టర్ ఈగ మల్లేశంహనుమకొండలోని గాంధీనగర్‌లోని వారి స్వగృహంలో ఆయన పార్థివ దేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.అనంతరం వారి కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు.ఈ సందర్భంగా ఇ.వి. సతీష్ కుమార్ సేవలను స్మరించుకుంటూ, ఆయన మరణం పట్ల తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. వారి ఆత్మకు శాంతి చేకూర్చాలని ఆయన భగవంతుణ్ణి ప్రార్థించారు. ఈ కార్యక్రమంలో పుల్లూరు అశోక్, సుదర్శన్ రెడ్డి, సంపత్ తదితరులు పాల్గొన్నారు.

## యూపీఎస్సీ ద్వారా నిర్వహించే
## పరీక్షలకు పటిష్ట ఏర్పాట్లు పూర్తి చేయాలి

- హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి
- హనుమకొండ జిల్లా కలెక్టరేట్ లో ఈ నెల 12న యూపీఎస్సీ - ఎన్డీఏ,
- నావల్ అకాడమీ ఎగ్జామినేషన్ నిర్వహణపై వివిధ శాఖల అధికారులతో సమన్వయ సమావేశం నిర్వహించిన జిల్లా కలెక్టర్



**హనుమకొండ ప్రతినిధి, ఏప్రిల్ 10,తరంగాలు** : యూపీఎస్సీ నిర్వహించే నేషనల్ డిఫెన్స్ అకాడమీ (ఎన్డీఏ), నావల్ అకాడమీ మరియు కంబైన్డ్ డిఫెన్స్ సర్వీస్ (సీడీఎస్) పరీక్షల నిర్వహణకు పటిష్ట ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి అధికారులను ఆదేశించారు.ఈనెల 12న నిర్వహించనున్న పరీక్షల సందర్భంగా కేంద్రాల వద్ద భద్రత, నిరంతర విద్యుత్, వైద్య సదుపాయాలు, ప్రశ్నాపత్రాల రవాణా తదితర అంశాలపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. అభ్యర్థుల సౌకర్యార్థం ఆర్టీసీ ద్వారా ప్రత్యేక బస్సులు నడపాలని తెలిపారు.జిల్లాలో యూనివర్సిటీ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో రెండు, పింగిలి ప్రభుత్వ బాలికల కళాశాలలో ఒక పరీక్షా కేంద్రం ఏర్పాటు చేయగా, మొత్తం 963 మంది అభ్యర్థులు హాజరుకానున్నారు.కలెక్టర్ మాట్లాడుతూ, నేషనల్ డిఫెన్స్ అకాడమీ, నావల్ అకాడమీ పరీక్ష మొదటి పేపర్ ఉదయం 10.00 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు, రెండో పేపర్ మధ్యాహ్నం 2.00 గంటల నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు నిర్వహించబడుతుందని తెలిపారు. అదేవిధంగా కంబైన్డ్ డిఫెన్స్ సర్వీస్ ఎగ్జామినేషన్–1లో మొదటి పేపర్ ఉదయం 9.00 గంటల నుంచి 11.00 గంటల వరకు, రెండో పేపర్ మధ్యాహ్నం 12.30 గంటల నుంచి 2.30 గంటల వరకు, మూడో పేపర్ సాయంత్రం 4.00 గంటల నుంచి 6.00 గంటల వరకు జరుగుతుందని పేర్కొన్నారు. సంబంధిత అధికారులు అన్ని ఏర్పాట్లు సమయానికి పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు.ఈ సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి సత్యపాల్ రెడ్డి, కలెక్టరేట్ పరిపాలన అధికారి గౌరీ శంకర్, విద్యుత్ శాఖ ఎస్ఈ మధుసూదన్ రావు, జిల్లా వైద్య ఆరోగ్య అధికారి డాక్టర్ అప్పయ్య, బీసీ సంక్షేమ అధికారి నరసింహమూర్తి, ఆర్టీసీ డీఎం ధరమ్ సింగ్, పింగిలి కళాశాల ప్రిన్సిపాల్ చంద్రమౌళి, పోస్టల్, పోలీస్ తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.

# పండించిన ప్రతిగింజను కొనుగోలు చేస్తాం

- మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి .
- అన్నదాతకు రక్షణగా భూ భారతి.
- రైతు భరోసా ఎకరానికి 12వేలు ఇస్తున్నాం.
- చేగోమ్మలో గోదాముల ప్రారంభం



**పాలేరు ఆర్సీ,ఏప్రిల్ 10 (తరంగాలు) :** రాష్ట్ర వ్యాప్తంగా రైతులు పండించిన ప్రతి ధాన్యం గింజను కొనుగోలు చేస్తామని రాష్ట్ర రెవెన్యూ,గృహ నిర్మాణ,సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి తెలిపారు. కూసుమంచి మండలంలో శుక్రవారం ఆయన జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి, సీపీ సునీల్ దత్ లతో కలిసి పర్యటించి పలు అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల్లో పాల్గొన్నారు. తొలుత వెంకటాపురం గ్రామంలో దేపంగి శ్రీకాంత్, వీరకుమారి దంపతులు నిర్మించుకున్న ఇందిరమ్మ ఇంటి గృహప్రవేశ కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం చేగొమ్మ గ్రామంలో ఒక కోటి 52 లక్షలతో నిర్మించిన 2 వేల మెట్రిక్ టన్నుల సామర్థ్యం గల ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం గోడౌన్ లను ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి మాట్లాడుతూ ఎన్నికల ముందు ఇచ్చిన మాట ప్రకారం రైతులను రాజు చేసే కార్యక్రమంలో భాగంగా రైతుల సంక్షేమంతో పాటు వారి అభివృద్ధి కోసం అనేక కార్యక్రమాలు చేపట్టామన్నారు. అధికారంలోకి వచ్చిన నాలుగు నెలల్లో రాష్ట్ర వ్యాప్తంగా 25 లక్షల మంది రైతులకు 20 వేల 670 కోట్లు రెండు లక్షల రూపాయల వరకు రుణ మాఫీ చేశామని, రైతు భరోసా ద్వారా ప్రతి ఎకరానికి 6 వేల రూపాయలు చొప్పున సంవత్సరానికి 12 వేలు ఇస్తున్నామని, సన్న వడ్లకు మద్దతు ధరతో పాటు క్వింటాకు అదనంగా 500 రూపాయలు బోనస్ అందిస్తున్నామని తెలిపారు. సన్న వడ్లను ఇతర ప్రాంతాలకు పంపకుండా పట్టించి పేదలకు సన్న బియ్యం అందిస్తున్నామని చెప్పారు. రాష్ట్ర వ్యాప్తంగా రైతులు పండించిన ప్రతి ధాన్యం గింజను కొనుగోలు చేస్తామని, కొన్న వారం రోజుల్లోగా రైతుల ఖాతాల్లో ప్రభుత్వం డబ్బులు జమ చేస్తున్నదని తెలిపారు.

**రైతులకు భరోసాగా భూ భారతి..**

రైతులకు భరోసాగా భూ భారతి తీసుకొచ్చి రాష్ట్ర వ్యాప్తంగా సుమారు 3 లక్షల 80 వేల మందికి కొత్త పాసు పుస్తకాలను అందజేశామని, ప్రతి అంగుళాన్ని సర్వే చేసి రైతుల పాసు పుస్తకంలో భూమి సర్వే మ్యాప్ ను ప్రింట్ చేసి భవిష్యత్ లో భూమి పంచాయతీలు రాకుండా ఉండే విధంగా చర్యలు చేపట్టామని మంత్రి పొంగులేటి స్పష్టం చేశారు. రైతులు, ఆడబిడ్డలు ఆత్మ గౌరవంతో బతికేలా, నిరుద్యోగులకు ఉద్యోగాలు ఇవ్వడంతో పాటు, ప్రతి వర్గాన్ని ప్రభుత్వం ఆదుకుంటూ, భవిష్యత్తులో మరింత అండగా ఉంటుందని తెలిపారు. చేగొమ్మ గ్రామస్తులు కోరిన విధంగా కొండాపురం రోడ్డును రాబోయే వర్షాకాలం లోపు పూర్తి చేయిస్తానని తెలిపారు.

- పంట నిలువ కోసం గోదాముల నిర్మాణం
- జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి

రైతులు పండించిన పంటల నిలువ కోసమే సొసైటీ ఆధ్వర్యంలో రెండు గోదాములను నిర్మించామని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి తెలిపారు. వేరే జిల్లాలపై ఆధారపడకుండా రెండు వేల మెట్రిక్ టన్నుల స్టోరేజ్ కెపాసిటీ సామర్థ్యం గల గోదాములను రైతులకు అందుబాటులోకి తెచామన్నారు. పంట కోతల ఆధారంగా ధాన్యం కొనుగోళ్లకు ఏర్పాట్లు చేసి, ధాన్యం కొనుగోళ్లు చేసిన వెంటనే రైతుల ఖాతాల్లో డబ్బులు జమ చేసే విధంగా ఏర్పాట్లు చేశామని చెప్పారు. అనంతరం కూసుమంచి మండలానికి చెందిన 191 మంది లబ్ధిదారులకి మంజూరైన 58 లక్షల 58 వేలు సిఎంఆర్ఎఫ్ చెక్కులను మంత్రి పొంగులేటి, జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి, సిపి సునీల్ దత్ లతో కలిసి పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఏదులాపురం మునిసిపల్ చైర్ పర్సన్ పోకబత్తిని అనిత, పాలేరు నియోజకవర్గ ప్రత్యేక అధికారి రమేష్, హౌసింగ్ పీడీ భూక్యా శ్రీనివాస్, డిసిఓ గంగాధర్, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి డి.పుల్లయ్య, ఖమ్మం ఆర్డీఓ శ్రీనివాస్, తహసీల్దార్ సైదులు, ఎంపీడీఓ రాజారావు, వివిధ గ్రామాల సర్పంచ్, ఉప సర్పంచులు, వార్డు సభ్యులు, వివిధ శాఖల అధికారులు, ప్రజా ప్రతినిధులు, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల వార్షికోత్సవ వేడుకలు



తరంగాలు ఖమ్మం జిల్లా బ్యూరో : ఖమ్మం : ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల, ఖమ్మం వార్షికోత్సవ వేడుకలు విద్యా ఉత్సాహం, సాంస్కృతిక వైభవం, ఆనందోత్సాహాల నడుమ ఘనంగా నిర్వహించబడ్డాయి. ఈ కార్యక్రమంలో విద్యార్థినులు, అధ్యాపక వర్గం, కళాశాల సిబ్బంది, ఆహ్వానిత అతిథులు పాల్గొన్నారు.ఈ వేడుకలకు ముఖ్య అతిథిగా సిద్ధార్థ విక్రమ్ సింగ్, ఐఎఫ్ఎస్, జిల్లా అటవీ అధికారి, ఖమ్మం హాజరయ్యారు. అలాగే జిల్లా ఉపాధి అధికారి మాధవి కూడా ఈ కార్యక్రమంలో పాల్గొని వేడుకలకు మరింత గౌరవాన్ని చేకూర్చారు.ఈ సందర్భంగా సిద్ధార్థ విక్రమ్ సింగ్ విద్యార్థినులను ఉద్దేశించి మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ, మహిళా సాధికారత, సుస్థిర భవిష్యత్తు నిర్మాణంలో యువత పాత్ర గురించి ప్రేరణాత్మక సందేశాన్ని అందించారు. సమాజాభివృద్ధిలో యువత, ముఖ్యంగా యువ మహిళలు, కీలక పాత్ర పోషించగలరని పేర్కొన్నారు. ఆత్మవిశ్వాసం, క్రమశిక్షణ, సామాజిక బాధ్యతతో ముందుకు సాగాలని విద్యార్థినులను ప్రోత్సహించారు .కార్యక్రమంలో భాగంగా విద్యా రంగం క్రీడా రంగాల్లో ప్రతిభ కనబరిచిన మెరిట్ విద్యార్థినులకు బహుమతులు ప్రశంసా పత్రాలు ప్రదానం చేయబడినవి. విద్యార్థినుల ప్రతిభ, కృషి, అంకితభావాన్ని ఈ సందర్భంగా ప్రత్యేకంగా అభినందించారు.ముఖ్య అతిథి ప్రసంగం విద్యార్థినులు అధ్యాపక వర్గంపై గొప్ప ముద్ర వేసింది. ప్రముఖ అతిథుల సమక్షం ప్రతిభావంతులైన విద్యార్థినుల సత్కారం ఈ వేడుకలను మరింత సార్థకంగా, స్మరణీయంగా మార్చాయి.కళాశాల యాజమాన్యం, అధ్యాపకులు, సిబ్బంది, మరియు విద్యార్థినులు సిద్ధార్థ విక్రమ్ సింగ్, ఐఎఫ్ఎస్ కి జిల్లా ఉపాధి అధికారి శ్రీమతి మాధవి కి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేశారు.ఈ వార్షికోత్సవ వేడుకలు కళాశాల యొక్క విద్యా ప్రావీణ్యం, మహిళా సాధికారత, యువతాభివృద్ధి, పచ్చదనం-- ప్రకాశవంతమైన భవిష్యత్తు నిర్మాణం పట్ల నిబద్ధతను ప్రతిబింబించాయి.



జాతీయ దిన పత్రిక
తరంగాలు

# అరైవ్ అలైవ్ కార్యక్రమాన్ని అధికారులు సమష్టిగా విజయవంతం చేయాలి

- వరంగల్ సీపీ సన్ ప్రీత్ సింగ్
- అరైవ్ అలైవ్ కార్యక్రమం ద్వారా సురక్షిత సమాజ నిర్మాణానికి అడుగులు వేద్దాం
- బ్లాక్ స్పాట్స్ పై ప్రత్యేక దృష్టి పెట్టి ప్రమాదాల నివారణకు కట్టుబడి ఉన్నాం
- అరైవ్ అలైవ్ కార్యక్రమం ద్వారా ప్రతి ప్రాణాన్ని కాపాడటం మా లక్ష్యం



**హనుమకొండ ప్రతినిధి, ఏప్రిల్ 10, తరంగాలు** : ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా ఈ నెల 13 నుండి 18 వరకు నిర్వహించనున్న "అరైవ్ అలైవ్" కార్యక్రమాన్ని అధికారులు సమష్టిగా విజయవంతం చేయాలని పోలీసు కమిషనర్ సన్ ప్రీత్ సింగ్ అన్నారు. శుక్రవారం హనుమకొండ కలెక్టరేట్‌లో పోలీసు కమిషనర్ అధ్యక్షతన వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలోని హనుమకొండ వరంగల్, జనగామ జిల్లాల కలెక్టర్లు చాహాత్ బాజ్ పాయి, డాక్టర్ సత్య శారద లతో కలసి అదనపు కలెక్టర్లు, డీసీపీలు, ఏసీపీలు, ఆర్ అండ్ బి, రవాణా తదితర శాఖల అధికారులతో సన్నాహక సమావేశం నిర్వహించారు.

ఈ సందర్భంగా పోలీసు కమిషనర్ మాట్లాడుతూ, రోడ్డు ప్రమాదాల నివారణకు "అరైవ్ అలైవ్" కార్యక్రమం కీలకమని పేర్కొన్నారు. ఈ నెల 13 నుండి 18 వరకు కార్యక్రమాలను ప్రణాళిక బద్ధంగా ప్రతిరోజు సమర్ధంగా అమలు చేయాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. పోలీసు,రెవిన్యూ, రవాణా, ఆర్ అండ్ బి శాఖల అధికారులు పరస్పర సమన్వయంతో పనిచేసి ప్రజల్లో ట్రాఫిక్ నియమాలపై విస్తృత అవగాహన కల్పించాలన్నారు. ప్రమాదాలు తరచుగా జరిగే బ్లాక్ స్పాట్స్‌ను గుర్తించి, తక్షణ చర్యలు చేపట్టాలని సూచించారు. పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ, ప్రమాదాలు ఎక్కువగా జరిగే ప్రాంతాలను గుర్తించి తక్షణ నివారణ చర్యలు చేపట్టాలని ఆదేశించారు. హసన్‌పర్తి పరిధిలో ప్రమాదాలు అధికంగా ఉన్నందున జాతీయ రహదారులు, ఆర్ అండ్ బి శాఖలు సమన్వయంతో చర్యలు తీసుకోవాలని తెలిపారు. ప్రతి ప్రమాదంపై విచారణ జరిపి కారణాలను గుర్తించి నివారణ చర్యలు అమలు చేయాలని సూచించారు. అదేవిధంగా రోడ్ల భద్రతా ప్రమాణాలను మెరుగుపరచడం, వాహనదారుల్లో బాధ్యతాయుత డ్రైవింగ్ అలవాటు పెంపొందించడం ద్వారా ప్రమాదాలను గణనీయంగా తగ్గించవచ్చని తెలిపారు. పెట్రోల్ బంక్ యాజమాన్యాలతో సమావేశాలు, డ్రైవర్లకు కంటి పరీక్షలు ఇప్పటికే నిర్వహించామని, అవసరమైన వారు కంటి అద్దాలు తప్పనిసరిగా వినియోగించాలన్నారు. పోలీస్ మరియు సాంస్కృతిక కళాబృందాల ద్వారా ప్రజల్లో అవగాహన పెంచుతామని తెలిపారు. చివరి రోజున రూల్స్ పాటించిన వారికి ప్రశంస పత్రాలు అందజేయనున్నట్లు పేర్కొన్నారు. ఆర్టీఏ ఆధ్వర్యంలో పాఠశాల బస్సుల ఫిట్నెస్, డ్రైవర్ల అర్హతలు, ఫస్ట్ ఎయిడ్ కిట్ అందుబాటుపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు.

తరచుగా ప్రమాదాలు జరుగుతున్న రహదారులపై ప్రమాదాల నివారణకు స్పీడ్ బ్రేకర్లు, రంబుల్ స్ట్రిప్స్, విద్యుత్ దీపాలు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ప్రమాదాలకు గురయ్యే ప్రాంతాల్లో అవసరమైన మౌలిక వసతులను మెరుగుపరచి భద్రతా చర్యలు చేపట్టాలని సూచించారు.

### హన్మకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయి మాట్లాడుతూ

అరైవ్ అలైవ్" కార్యక్రమంలో భాగంగా రోడ్డు భద్రతపై రోజువారీ కార్యక్రమాలను సమర్థవంతంగా నిర్వహించాలని సూచించారు. జిల్లా, మునిసిపల్, గ్రామ స్థాయిలో రోడ్ సేఫ్టీ కమిటీలు ఏర్పాటు చేసి అవగాహన సమావేశాలు నిర్వహించాలని తెలిపారు.

ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్లు ధరించేలా పర్యవేక్షణ చేయాలని, అధికారులు కూడా ఆదర్శంగా ఉండాలని సూచించారు. మీడియా ద్వారా విస్తృత ప్రచారం నిర్వహించి, బ్లాక్ స్పాట్స్ వద్ద ప్రమాదాల నివారణకు చర్యలు చేపట్టాలని ఆదేశించారు.

ప్రైవేట్ పాఠశాల బస్సుల ఫిట్నెస్, డ్రైవర్ల అర్హతలపై దృష్టి పెట్టడంతో పాటు అవసరమైన కంటి అద్దాలు అందించేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత శాఖలకు సూచించారు.

### వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్యశారద మాట్లాడుతూ

బ్లాక్ స్పాట్స్‌పై ప్రత్యేక దృష్టి సారించి రోడ్డు ప్రమాదాల నివారణకు కట్టుబడి ఉండాలని, 'అరైవ్ అలైవ్' కార్యక్రమం ద్వారా సురక్షిత సమాజ నిర్మాణానికి కలిసి ముందడుగు వేయాలని అన్నారు. వివిధ ప్రచార మాధ్యమాలు, కళాజాత కార్యక్రమాల ద్వారా రోడ్డు భద్రతపై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించినప్పుడే ప్రమాదాలను తగ్గించగలమని ఆమె పేర్కొన్నారు. జిల్లాలోని ప్రైవేట్ పాఠశాల బస్సుల ఫిట్నెస్‌పై ప్రత్యేక దృష్టి సారించినట్లు తెలిపారు. మొత్తం బస్సులలో గణనీయమైన సంఖ్యలో ఫిట్నెస్ తనిఖీలు పూర్తిచేసి, డ్రైవర్లకు ఆరోగ్య, కంటి పరీక్షలు నిర్వహించినట్లు చెప్పారు. మిగిలిన బస్సుల ఫిట్నెస్‌ను త్వరితగతిన పూర్తి చేసి, అన్ని వాహనాలు భద్రతా ప్రమాణాలకు అనుగుణంగా ఉండేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. విద్యార్థుల భద్రతను అత్యంత ప్రాధాన్యతగా తీసుకుని సంబంధిత శాఖలు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ సూచించారు.

### జనగామ జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా వీడియో కాన్ఫరెన్స్ ద్వారా హాజరై మాట్లాడుతూ,

నేషనల్ హైవేపై ఎక్కువ ప్రమాదాలు జరుగుతున్న నేపథ్యంలో ప్రత్యేక చర్యలు అవసరమని తెలిపారు. ప్రమాదాలున్న ప్రాంతాలను గుర్తించి తక్షణ నివారణ చర్యలు చేపట్టాలని సూచించారు.

రోడ్డు భద్రతపై అవగాహన కార్యక్రమాలను విస్తృతంగా నిర్వహించి, ట్రాఫిక్ నియమాల అమలును కట్టుదిట్టం చేయాలని అధికారులను ఆదేశించారు. సంబంధిత శాఖలు సమన్వయంతో పనిచేసి ప్రమాదాల నియంత్రణకు కృషి చేయాలని పేర్కొన్నారు.

ఈ సమావేశంలో డిపిపి లు రాజమహేంద్ర నాయక్, దార కవిత, అంకిత్ కుమార్, ప్రభాకర్ రావు, అదనపు కలెక్టర్లు ఎన్. రవి, సంధ్యారాణి, వై వి గణేష్, ఆర్ అండ్ బి, రవాణా, రెవెన్యూ, విద్యుత్, ఆర్టీసీ, సంబంధిత శాఖల జిల్లాల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.




## లైన్స్ క్లబ్ ఆధ్వర్యంలో గొడుగుల పంపిణీ



**జఫర్గడ్ ప్రతినిధి, ఏప్రిల్ 10,(తరంగాలు):**

లైన్స్ క్లబ్ ఇంటర్నేషనల్ ఆధ్వర్యంలో మండలం లోని లో తమ్మడపల్లి జి గ్రామంలో ఎండ వేడిమి తట్టుకోవడానికి స్ట్రీట్ వండర్స్ కురగాయలు,చాపలు, నిత్యవసర వస్తువులు స్ట్రీట్ రోడ్డుపై చిరు వ్యాపారస్తులకు లైన్స్ క్లబ్ ఆధ్వర్యంలో గొడుగుల పంపిణీ చేశామని లైన్స్ క్లబ్ జఫర్గడ్ అధ్యక్షుడు మామిడాల పూర్ణచందర్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో లైన్స్ క్లబ్ డైరెక్టర్ లయన్ దాంశెట్టి సోమేశ్వర్, లయన్ కూరపాటి రాజు, లయన్ బజ్జీర్ సంతోష్ కుమార్, లయన్ ముక్కాలా భాస్కర్ రెడ్డి, లియో కోఆర్డినేటర్ లయన్ బైరి వెంకటేశ్వర్లు,జాయింట్ సెక్రటరీ లయన్ మెరుగు రాజు, జి ఎల్ టి కోఆర్డినేటర్ లయన్ రోడ్డ రాజు, తమ్మడపల్లి జి లోని ఉపసర్పంచ్ ముక్కెర రాజు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## నిందితులను కఠినంగా శిక్షించాలి

- బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి డాక్టర్ వన్నాల వెంకటరమణ



**వర్ధన్నపేట ప్రతినిధి, ఏప్రిల్ 10,తరంగాలు** : యువతిని సామూహిక అత్యాచారం చేసి హత్యకు పాల్పడిన నిందితులను కఠినంగా శిక్షించాలని

బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి డాక్టర్ వన్నాల వెంకటరమణ అన్నారు. వర్ధన్నపేట మండలం ఇల్లంద గ్రామంలోని పార్టీ కార్యాలయంలో పత్రిక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాయపర్తి మండలం ఏకే తండాలో గిరిజన యువతి గుగులోతు మహేశ్వరి పై జరిగిన సామూహిక అత్యాచారం మరియు అనుమానాస్పద హత్య ఘటనపై ఖచ్చితమైన, పారదర్శక విచారణ చేపట్టి నిందితులను కఠినంగా శిక్షించాలని బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి డాక్టర్ వన్నాల వెంకటరమణ తీవ్రంగా డిమాండ్ చేశారు.

ఈ దారుణ ఘటన సమాజాన్ని కలచివేసిందని, గిరిజన మహిళల భద్రతపై తీవ్రమైన ఆందోళన కలిగిస్తున్నదని ఆయన పేర్కొన్నారు. వర్ధన్నపేట మండలం ఏకే తండాలోనే ఇలాంటి దుర్ఘటన జరగడం అత్యంత విచారకరమని, బాధిత కుటుంబానికి న్యాయం జరిగే వరకు పోరాటం కొనసాగిస్తామని స్పష్టం చేశారు. ఈ ఘటనలో మరో కోణంగా, కొంతమంది యువకులు గంజాయి వంటి మాదకద్రవ్యాలను సేవించి మత్తులో ఈ ఘోరానికి పాల్పడినట్టు సమాచారం వెలువడుతున్నదని, రాష్ట్రంలో మాదకద్రవ్యాల నియంత్రణలో ప్రభుత్వం పూర్తిగా వైఫల్యం చెందిందని ఆయన ఆరోపించారు. గంజాయి మరియు ఇతర మాదకద్రవ్యాల వ్యాప్తిని అరికట్టడంలో ప్రభుత్వం నిర్లక్ష్యం వహించడం వల్లనే ఇలాంటి ఘటనలు పెరుగుతున్నాయని విమర్శించారు. మహిళలపై జరుగుతున్న అత్యాచారాలపై పోలీసు వ్యవస్థతో పాటు రాష్ట్ర ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకుని, భవిష్యత్తులో ఇలాంటి దుర్ఘటనలకు తావు లేకుండా కట్టుదిట్టమైన చర్యలు చేపట్టాలని డాక్టర్ వన్నాల వెంకటరమణ మరీ మరీ కోరారు. నిందితులపై ఎలాంటి రాజకీయ, ఇతర ఒత్తిళ్లు లేకుండా నిష్పాక్షికంగా విచారణ జరిపి త్వరితగతిన న్యాయం చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి బన్న ప్రభాకర్, కార్యదర్శి రాయపూరపు కుమారస్వామి, మాజీ జిల్లా ఉపాధ్యక్షులు నాంపల్లి యాకయ్య, మాజీ టౌన్ అధ్యక్షులు పెద్దూరి రాజ్ కుమార్, ఇల్లంద శక్తి కేంద్రం ఇన్చార్జి సట్ల అనిల్, వార్డు సభ్యులు జోగుల సంపత్ తదితరులు పాల్గొన్నారు.

# తిరుపతమ్మ చిత్రపటానికి నివాళులర్పించిన కేంద్ర ఖాదీ చిన్న పరిశ్రమల పూర్వ డైరెక్టర్ ఈగ మల్లేశం



**హన్మకొండ ప్రతినిధి, ఏప్రిల్ 10,తరంగాలు** :

తిరుపతమ్మ చిత్రపటానికి కేంద్ర ఖాదీ మరియు చిన్న పరిశ్రమల పూర్వ డైరెక్టర్ ఈగ మల్లేశం నివాళులర్పించారు. హన్మకొండ బాల సముద్రంకు చెందిన గొట్టిముక్కుల కేశవరావు తల్లి గొట్టిముక్కుల తిరుపతమ్మ అనారోగ్యంతో మరణించిన వార్త తెలుసుకున్న కేంద్ర ఖాదీ మరియు చిన్న పరిశ్రమల పూర్వ డైరెక్టర్ ఈగ మల్లేశం వారి నివాసానికి వెళ్లి తిరుపతమ్మ చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం వారి కుటుంబ సభ్యులను పరామర్శించి,వారి ఆత్మకు శాంతి చేకూర్చాలని భగవంతుణ్ణి వేడుకున్నారు. ఈ కార్యక్రమం లో పుల్లూరు అశోక్, సుదర్శన్ రెడ్డి, మాజీ కార్పొరేటర్ మేకల బాబూరావు తదితరులు పాల్గొన్నారు.



THARANGALU DAILY NEWS
శనివారం, 11 ఏప్రిల్, 2026
జాతీయ దిన పత్రిక
తరంగాలు

# ఘనంగా ఎమ్మెల్యే నాగరాజు దంపతుల పెళ్లిరోజు వేడుకలు



వరంగల్ ప్రతినిధి, ఏప్రిల్ 10,తరంగాలు : గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరే షన్ 14 డివిజన్ ఏనుమా ముల ఇందిరమ్మ కాలనీ ఫేస్ 1 గ్రామ మాజీ అధ్యక్షుడు గొలుసుల సంతోష్. మాజీ కాంగ్రెస్ యూత్ అధ్యక్షుడు కుంభం శివ పటేల్ నర్సింగోజు.నరేంద్ర చారి ఆధ్వర్యంలో వర్ధన్నపేట శాసనసభ్యులు కె ఆర్ నాగరాజు- మల్లీశ్వరి దంపతుల పెళ్లిరోజు సందర్భంగా ఇందిరమ్మ ఫేస్ 1 గ్రామంలో ఘనంగా నిర్వహించడం జరిగింది.

ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా కార్పొరేటర్ తూర్పాటి సులోచన సారయ్య, 14 వ డివిజన్ అధ్యక్షులు సయ్యద్ ఇంతియాజ్, సీనియర్ నాయకులు అడుప మహేష్ విచ్చేసి కేక్ కట్ చేసి సుమారు వంద మందికి పండ్ల పంపిణీ చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో సౌరం సుభాష్ పులి చేరి రాధాకృష్ణ, పస్తం శంకర్, కడెం కుమార్, మచ్చర్ల స్టాలిన్, ఈర్ల రాజేందర్, వరంగల్ భాషా భాయ్, జానీ, బండ్ల సురేం దర్, ఏకాబ్రా చారి ,తిరుపతి,పస్తం కల్నా యక్, యూత్ నాయకులు సౌరం టోనీ, పిట్ట సుధీర్, వివిధ నాయకులు సుమా రు వందమంది కార్య కర్తలు , స్థానిక మహిళలు, పిల్లలు తదితరులు పాల్గొన్నారు.





# ఎమ్మెల్యే కే ఆర్ నాగరాజు- మల్లేశ్వరి దంపతులకు పెళ్లిరోజు శుభాకాంక్షలు

## తెలిపిన ఎద్దు సత్య నారాయణ,పోశాల వెంకన్న గౌడ్

వర్ధన్నపేట ప్రతినిధి, ఏప్రిల్ 10,తరంగాలు : పేదల పెన్నిధి, వర్ధన్నపేట నియోజకవర్గ అభివృద్ధి ప్రదాత ఎమ్మెల్యే కే ఆర్ నాగరాజు- మల్లేశ్వరి

పుణ్య దంపతులకు వర్ధన్నపేట కాంగ్రెస్ నాయకులు ఎద్దు సత్య నారాయణ,పోశాల వెంకన్న గౌడ్ వివాహ వార్షికోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు. శుక్రవారం ఎమ్మెల్యే కే ఆర్ నాగరాజు- మల్లేశ్వరి ఆదర్శ దంపతుల పెళ్లిరోజు సందర్భంగా హనుమకొండలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజును కాంగ్రెస్ నాయకులు ఎద్దు సత్య నారాయణ,పోశాల వెంకన్న గౌడ్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేకు శాలువా కప్పి వివాహ వార్షికోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు.

ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు మరుపట్ల సాయికుమార్,కాంగ్రెస్ పార్టీ నాయకులు



కస్తూరి సదానందం,ఎద్దు రాజశేఖర్,తదితరులు పాల్గొన్నారు.

# తమ్ముడికి హ్యాండిచ్చిన సారా టెండూల్కర్..

భారత క్రికెట్ దిగ్గజం సచిన్ టెండూ ల్కర్ తనయ సారా టెండూ ల్కర్ లక్నోలో సందడి చేసింది. ఐపీఎల్ 2026 సీజన్‌లో భాగంగా గుజరాత్ టైటాన్స్, లక్నో సూపర్ జెయింట్స్ మధ్య ఆదివారం జరిగే మ్యాచ్ కోసం ఆమె లక్నోకు వచ్చినట్లు తెలుస్తోంది. లక్నో ఎయిర్‌పోర్ట్‌లో సారా టెండూ ల్కర్‌ను చూసిన మీడియా ప్రతి నిధులు.. ఎవరికి సపోర్ట్ చేస్తారంటూ ఆమెను ప్రశ్నించారు. గుజరాత్ టైటాన్స్ జట్టుకా..? లేక తన తమ్ముడు అర్జున్ టెండూల్కర్ ప్రాతి నిధ్యం వహిస్తున్న లక్నో సూపర్ జెయింట్స్ టీమ్‌కు మద్దతు తెలుపు తారా? అని ప్రశ్నించారు. సారా టెండూల్కర్ మాత్రం సమాధానం చెప్పకుండా చిరునవ్వుతో వారికి దూరంగా వెళ్లిపోయింది. ప్రస్తుతం ఇందుకు సంబంధించిన వీడియో నెట్టింట వైరల్ కాగా.. నెటిజన్లు తమదైన శైలిలో కామెంట్ చేస్తున్నారు. తన ప్రియుడు శుభ్‌మన్ గిల్ కోసమే సారా టెండూల్కర్ లక్నోకు వచ్చిందని, గుజరాత్ టైటాన్స్‌కే మద్దతు తెలుపుతుందని కామెంట్ చేస్తున్నారు. తమ్ముడు జట్టు అయిన లక్నో సూపర్ జెయింట్స్‌కు సపోర్ట్ చేసేందుకు అతను ఏమైనా తుది జట్టులో ఆడుతాడా? అని ప్రశ్నిస్తున్నారు. శుభ్‌మన్ గిల్ కెప్టెన్సీలోని గుజరాత్ టైటాన్స్‌కు మద్దతు తెలిపేందుకే సారా లక్నోకు వచ్చిందని, లేకుంటే తన తమ్ముడు ప్రాతినిధ్యం వహిస్తున్న లక్నో సూపర్ జెయిం ట్స్‌కు మద్దతు తెలుపుతానని మీడియాకు తెలిపేదని ఫ్యాన్స్ అంటు న్నారు. ఏది ఏమైనా సొంత తమ్ముడికి సారా టెండూల్కర్ షాకిచ్చి ందని, తమ్ముడు అర్జున్ టెండూల్కర్ కంటే ప్రియు డు శుభ్‌మన్ గిల్ ఎక్కువ య్యాడని కామెంట్ చేస్తు న్నారు. సారా టెండూల్క ర్, శుభ్‌మన్ గిల్ పీకల్లో తు ప్రేమలో ఉన్నట్లు గత కొన్ని రోజులుగా



ప్రచారం జరుగు తున్న సంగతి తెలిసిందే. అయితే ఈ ఇద్దరూ తమ ప్రేమ విష యంపై ఎలాంటి అధికా రిక ప్రకటన చేయలేదు. ఈ వార్తలను కూడా ఖండించలేదు. ఐపీఎల్ 2026 సీజన్‌లో అర్జున్ టెండూల్కర్ లక్నో సూపర్ జెయింట్స్‌కు ప్రాతినిధ్యం వహిస్తున్నాడు. వరుసగా రెండు మ్యాచ్‌ల్లో గెలిచిన లక్నో ఆదివారం సొంత గడ్డపై గుజరాత్ టైటాన్స్‌తో తలపడనుంది. శుక్రవారం సారా టెండూల్కర్ లక్నో ఎయిర్ పోర్ట్‌లో కనిపించడంతో ఈ మ్యాచ్ కోసమే సారా వచ్చిందని అంతా అనుకుంటున్నారు. కానీ ఆమె రాకపై ఎలాంటి క్లారిటీ లేదు. బహుషా అర్జున్ సతీమణి, తన మరదలుకు తోడుగా వచ్చి ఉంటుం దని, అనవసర పుకార్లు పుట్టించ వద్దని సచిన్ ఫ్యాన్స్ కోరుతున్నారు.

# భార్య, ఇద్దరు బాలికల హత్య కేసులో 9 మంది అరెస్ట్

- ఆడపిల్ల పుడుతుందనే అపనమ్మకంతో దారుణం
- పక్కా ప్లాన్ ప్రకారమే హత్య
- వరంగల్ జిల్లాలో సంచలనం సృష్టించిన ఘటన
- టెక్నాలజీతో కేసు ఛేదించిన పోలీసులు
- పోలీసులను అభినందించిన సిపి సన్ ప్రీత్ సింగ్



వరంగల్, ఏప్రిల్ 10 (తరంగాలు ప్రతినిధి): ఆడపిల్లలను జన్మనిస్తుందనే అపనమ్మకంతో భార్యతో పాటు ఇద్దరు చిన్నారులను హత్య చేసిన దారుణ ఘటన రాష్ట్రవ్యాప్తంగా సంచలనం సృష్టించింది. ఈ కేసులో ప్రధాన నిందితుడు యం.డి అజారుద్దీన్‌తో పాటు మరో తొమ్మిది మందిని పోలీసులు అరెస్టు చేయగా, ఇద్దరు నిందితులు పరారీలో ఉన్నట్లు పోలీసులు వెల్లడించారు. ఈ ఘటన సమాజాన్ని తీవ్రంగా కలవరపరిచింది.వరంగల్ సిపి సన్ ప్రీత్ సింగ్ తెలిపిన వివరాల ప్రకారం హన్మకొండ జిల్లా పున్నెలు గ్రామానికి చెందిన అజారుద్దీన్ 2016లో ఫరహత్‌ను ప్రేమ వివాహం చేసుకున్నాడు. వీరికి ఇద్దరు కుమార్తెలు జన్మించారు. అయితే కుమారుడు పుట్టాలనే కోరికతో నిందితుడు, అతని కుటుంబ సభ్యులు బాధితురాలిపై ఒత్తిడి తెచ్చినట్లు వెల్లడైంది. 2021, 2022లో గర్భం దాల్చిన సమయంలో లింగ నిర్ధారణ చేయించి ఆడపిల్ల పుడుతుందని తెలుసుకుని బలవంతంగా గర్భస్రావాలు చేయించినట్లు పోలీసులు తెలిపారు. ఇదే సమయంలో మరో మైనర్ బాలికతో సంబంధం పెట్టుకున్న నిందితుడు ఆమెను వివాహం చేసుకోవాలని భావించాడు. భార్య, పిల్లలు ఉన్న కారణంగా ఆ బాలిక నిరాకరించడంతో వారిపై కక్ష పెంచుకున్నాడు. చివరికి వారిని హతమార్చాలని పథకం రచించి అమలు చేసినట్లు విచారణలో వెల్లడైంది.ఈ నెల 1వ తేదీ రాత్రి ఐస్‌క్రీమ్ తినిపిస్తానని చెప్పి భార్య, పిల్లలను స్విమ్మింగ్ పూల్ వద్దకు తీసుకెళ్లాడు. ముందుగానే సీసీ కెమెరాలు, విద్యుత్ నిలిపివేసి ప్రణాళిక ప్రకారం ముగ్గురినీ నీటిలో ముంచి హత్య చేశాడు. అనంతరం ప్రమాదవశాత్తు మృతి చెందినట్లు నాటకం ఆడినప్పటికీ, బాధితురాలి కుటుంబం ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. సాంకేతిక ఆధారాలను వినియోగించి నిందితుడి కుట్రను పోలీసులు బయటపెట్టారు. ఈ కేసులో అజారుద్దీన్‌తో పాటు అతని కుటుంబ సభ్యులు, వైద్య సిబ్బంది, ఇతర సహాయకులను కలిపి మొత్తం తొమ్మిది మందిని అరెస్టు చేశారు. మరో ఇద్దరు నిందితులు పరారీలో ఉండగా, వారిని పట్టుకునేందుకు ప్రత్యేక బృందాలు గాలింపు చర్యలు చేపట్టాయి. ఈ కేసును విజయవంతంగా ఛేదించిన పోలీసు అధికారులను వరంగల్ పోలీస్ కమిషనర్ అభినందించారు. నేరాలపై కఠిన చర్యలు తీసుకుంటామని, మహిళలపై హింసకు పాల్పడే వారిని ఎట్టి పరిస్థితుల్లోనూ వదిలిపెట్టబోమని స్పష్టం చేశారు. సమాజంలో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా కఠిన చర్యలు కొనసాగిస్తామని తెలిపారు.

### పోలీసులు అరెస్టు చేసిన నిందితులు వీరే

పోలీసులు అరెస్టు చేసిన వారిలో ప్రధాన నిందితుడు వరంగల్ జిల్లా, పున్నెలు గ్రామానికి చెందిన యం.డి అజారుద్దీన్ (29)తో పాటు, నిందితుడి కుటుంబ సభ్యులు పున్నెలు గ్రామానికి చెందిన యం.డి చాంద్‌పాషా (49),యం.డి సలీహా (45), యం.షరోద్దీన్ (25)లతో పాటు బసిక స్రవంతి(32),కడిపికొండ, బాల్నె పార్ధు (47) నెక్కొండ, బొమ్మెర మనోహర్(39), గీసుగొండ, లింగాల నరేష్(37), కొండపర్తి, సాట్లరాజు (32),పున్నెలు, వాకుదోట్ భద్రు (60),ఎనుగల్లు చెందిన వారిని పోలీసులు అరెస్టు చేయగా, మరో ఇద్దరు నిందితులు డా. బాల్నె పూర్ణిమ, డా. ఎస్.రవళీ ప్రస్తుతం పరారీలో వున్నారు.

